ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 27.5
కనిష్ఠం 15.4
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
గురువారం 20 నవంబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585.50 (298.8775)	నిల్	14,760
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.20 (4.25)	1,031.82	723.02
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.095 (42.886)	1,000	8,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.152 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260

భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి గిరి ప్రదక్షిణ బుధవారం భక్తిశ్రద్ధల నడుమ కొనసాగింది. ఉదయాన్నే ఆలయానికి చేరుకున్న భక్తులు కార్తీక దీపాలు వెలిగించి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దారి పొడవునా భక్తుల సందడి కన్పించింది.

- యాదగిరిగుట్ట



వలిగొండలో నివాళి అర్పిస్తున్న నాయకులు

ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయం

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో ఆమె చిత్రపటాలను ఏర్పాటు చేసి నివాళి అర్పించారు.

సీపీఐ బస్సుయాత్ర



సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర బుధవారం జిల్లాలో కొనసాగింది. ఈ నెల 15న గద్వాల నుంచి ప్రారంభమైన యాత్ర బుధవారం జిల్లాకు చేరింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొని నాయకులు స్వాగతం పలికారు.

- చౌటుప్పల్ టౌన్, సంస్థాన్‌నారాయణపురం


చేనేత సమస్యలు పరిష్కరించాలి

● డిప్యూటీ డైరెక్టర్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మోత్కూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలయ్యేలా చూడాలని చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో వీవర్ సర్వీస్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ అరుణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అర్హులైన చేనేత కార్మికులందరికీ 90శాతం రాయితీతో మగ్గాలు, 100 శాతం రాయితీతో వర్క్‌షెడ్లు నిర్మించి ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వీవర్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు ఎప్పటికప్పుడు మారుతున్న నూతన డిజైన్లకనుగుణంగా శిక్షణ ఇవ్వాలన్నారు. దేశంలో సుమారు 50లక్షల మంది చేనేత కార్మికులు ఉండగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో రూ.200కోట్లు మాత్రమే కేటాయించడంతో చేనేత కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. పారిశ్రామికవేత్తలకు రుణమాఫీ చేసిన కేంద్రప్రభుత్వం చేనేతరంగాన్ని చిన్న చూపు చూస్తున్నదన్నారు. కార్యక్రమంలో పాశికంటి లక్ష్మీనర్సయ్య, జెల్ది రాములు, దుడుకు ఉప్పలయ్య పాల్గొన్నారు.



● రూ.15 కోట్ల భూమిపై కన్ను ● నకిలీ పత్రాలు సృష్టించి కాజేసే యత్నం
● భూమిని బీఆర్ఎస్‌నేత కబ్జా చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు ● సమగ్ర విచారణకు ఆదేశం

నకిలీ పత్రాలు సృష్టించి రూ.కోట్ల విలువైన భూమిని కాజేయాలని చూసిన వైనం చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో వెలుగు చూసింది. కొంతమంది రాజకీయ నేతల ప్రోద్బలంతో జారీ అయితే పట్టాదారు పాస్ పుస్తకాలను రద్దు చేయడంతోపాటు సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన కొంతమంది నేతలు కలెక్టర్ ఎం.హనుమంతరావుకు ఫిర్యాదుచేశారు. నకిలీపత్రాలతో భూమిని పట్టా చేసుకున్న వ్యవహారంపై తగిన విచారణ జరిపించి, చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారులో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ సమీపంలో సర్వే నెంబర్ 42లో దాదాపు రూ.15కోట్ల విలువైన 3.05 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిపై కన్నేసిన బీఆర్ఎస్ నేత నిరంజన్‌గౌడ్ కొందరు రెవెన్యూ అధికారులతో కలిసి నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి ఈ భూమిని కబ్జా చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని కోరుతూ సామాజిక కార్యకర్తలు, గ్రామస్థులు ఫిర్యాదుచేశారు. దీంతో ఆ సర్వే నెంబర్‌లోని భూమిని రెవెన్యూ అధికారులు బ్లాక్‌లిస్టులో ఉంచారు. అయితే తాజాగా వచ్చిన భూభారతి వెబ్‌సైట్‌లోనూ ఈ సర్వేనెంబర్‌ని బ్లాక్ చేయడంతో.. భూభారతిలో చేర్చి తమకు పాస్‌పుస్తకాలు, ఇతర రికార్డులు ఇప్పించాలని కోరుతూ నిరంజన్‌గౌడ్ హైకోర్టులో రిట్‌పిటిషన్ దాఖలుచేశారు. ఈ రిట్‌ని విచారించిన హైకోర్టు ఈ వివాదాన్ని రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని సూచిస్తూ ఆదేశాలిచ్చింది. దీంతో కోర్టు ఆదేశాలను అమలు చేసే క్రమంలో చౌటుప్పల్ ఆర్డీవో ఆదేశాలతో చౌటుప్పల్ తహసీల్దార్ ఈ సర్వేనెంబర్‌లోని 3.05ఎకరాల భూమిపై సమగ్ర విచారణ జరిపారు. తహసీల్దార్ విచారణలో కబ్జా నిజమని తేలడంతో నిరంజన్‌గౌడ్‌తోపాటు అతనికి సహకరించిన ఉద్యోగులపై క్రిమినల్ కేసులు నమోదుచేసి, చర్యలు తీసుకోవాలని కోరుతూ చౌటుప్పల్ తహసీల్దార్ బి.వీరాబాయి చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.

వెలుగులోకి విస్తుపోయే నిజాలు

తహసీల్దార్ జరిపిన విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. భూమిని కబ్జా చేసేందుకు ఏకంగా ఒక బినామీని తెరమీదకు తెచ్చి... తొలుత అతనిపైకి భూమిని మార్పించి... ఆపై తాను ఆ భూమిని కొనుగోలు చేసినట్లు బీఆర్ఎస్ నాయకుడు రికార్డులు సృష్టించారు. ఈ తతంగానికి సహకరించని పక్షంలో రెవెన్యూ కార్యాలయ ఉద్యోగిని బదిలీ చేయిస్తానని బెదిరించడంతో ఈ తతంగానికి తాను సహకరించినట్లు అప్పటి రెవెన్యూ కార్యాలయ ఉద్యోగి స్వయంగా అంగీకరించడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

నకిలీ పత్రాలతో భూమికి స్కెచ్

ఈ భూమి వ్యవహారంపై తహసీల్దార్ జరిపిన విచారణలో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. దండుమల్కాపూర్ రెవెన్యూ రికార్డులలో సర్వే నెంబర్ 42లోని 3.05 ఎకరాల భూమిని 1961-62 నుంచి 2013-14 వరకు పట్టాదారుగా, అనుభవదారుగా తెల్లపాటి భూషయ్య పేరు నమోదైంది. అయితే గ్రామంలో భూపయ్య పేరుగల వారు కానీ, అతని వారసులు కానీ ఎవరూ అందుబాటులో లేని విషయాన్ని గుర్తించిన కబ్జాదారులు రూ.కోట్ల విలువైన ఈ భూమిని కాజేయాలని సంకల్పించి స్కెచ్ వేశారు. తమ ప్రణాళికలో భాగంగా ఈ భూమిని భూషయ్య వద్ద నుంచి భోగినేని మోహన్‌రావు అనే వ్యక్తి సాదాబైనామా ద్వారా 1994 జూన్ 5న కొనుగోలు చేసినట్లు పత్రం సృష్టించారు. ఈపత్రాన్ని చూపుతూ మోహన్‌రావు ఈ భూమిపై తనకు ఈ-పీపీబీ జారీ చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో చేసుకున్న దరఖాస్తు ప్రకారం మోహన్‌రావుకు అనుకూలంగా 2007, ఏప్రిల్ 28న బీ/4835/2006 నెంబర్ ద్వారా 13-బీ జారీచేశారు. దరఖాస్తు ప్రకారం మోహన్‌రావు పేరును రికార్డులలో చేర్చాలని అప్పటి తహసీల్దార్ 2019, సెప్టెంబరు 23న ప్రొసీడింగ్స్ నెంబర్ బీ 1810/2018ని జారీ చేశారు. అయితే అతని (మోహన్‌రావు) పేరును ధరణి రికార్డులలో చేర్చలేదు. మోహన్‌రావు దరఖాస్తు ప్రకారం అతనికి ఈ ఈ-పీపీబీ జారీ చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం నుంచి 2022, ఏప్రిల్ 10న కలెక్టర్‌కు యూఎల్ 2200004916 చెక్ లిస్ట్‌ను పంపారు. అది కూడా ఆమోదం పొందలేదు. ఆ తర్వాత ఈ భూమిని మోహన్‌రావు వద్ద నుంచి గిర్కటి నిరంజన్‌గౌడ్ డాక్యుమెంట్ నెంబర్ 529/1.4.23న కొనుగోలు చేసినట్లు మిగతా 8వ పేజీలో

జాబితాను నివేదిస్తాం



వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మోత్కూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల జాబితాను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపీడీవో బాలాజీ తెలిపారు. 'ఇందిరమ్మా... ఇదేమిటమ్మా, ఇందిరమ్మ ఇళ్లకు నోచని పొడిచేడు' అన్న శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ కథనంపై అదనపు కలెక్టర్ ఆరా తీసినట్లు తెలిసింది. స్పందించిన ఎంపీడీవో డి.బాలాజీ, ఎంపీవో పి.జనార్దన్‌రెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి విచారణ జరిపారు. అధికార పార్టీలోని ఇరువర్గాలను విచారించినట్లు తెలిసింది. 20మంది లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను ఎమ్మెల్యే సామేలుకు, ఉన్నతాధికారులకు పంపుతున్నామని చెప్పారు. అయితే పొడిచేడు గ్రామానికి 20 ఇళ్లు కేటాయించినట్లు చెబుతున్నప్పటికీ ఇప్పటివరకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయలేదు. అధికార పార్టీలో ఇరువర్గాల మధ్య ఉన్న విభేదాల కారణంగా ఆ గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం లేదని ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలి

● కలెక్టర్ హనుమంతరావు

తుర్కపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని నిల్వ ఉంచకుండా కొనుగోలుచేసి ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం తుర్కపల్లి మండలంలోని పెద్దతండా, ముల్కలపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఇప్పటివరకు ఎంత ధాన్యం వచ్చిందని, ఎంత కొనుగోలు చేశారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎంత రాత్రి అయినా కాంటా వేసి మిల్లులకు తరలించాలన్నారు. ఆయనవెంట తహసీల్దార్ జే.బాలకుమారి, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, జనార్ధన్‌రెడ్డి ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

వివిధ దశలలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం మండలంలోని ముల్కలపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట తహసీల్దార్ జే.బాలకుమారి, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, పీఏసీఎస్ సిబ్బంది జనార్ధన్‌రెడ్డి ఉన్నారు.

పాల బిల్లులు చెల్లించాలి



పాల కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న పాడి రైతులు

రాజాపేట, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాజాపేట మండలం పారుపల్లి పాల కేంద్రం వద్ద పాడి రైతులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. పాలకేంద్రానికి గంటసేపు తాళం వేశారు. మదర్ డెయిరీ నుంచి నాలుగు నెలల నుంచి పాల బిల్లులు రావడంలేదని ఎనిమిది బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాడి రైతులు మోత్కుపల్లి నవీన్‌కుమార్, కాలె నర్సింహులు, సోమయ్య, వీరయ్య, మహేశ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి కృషి

● అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి గంజ్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కర్‌రావు అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లాకేంద్రంలో బుధవారం ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను సరిగ్గా చూడకపోతే రేపు మన పరిస్థితి అలాగే అవుతుందన్నారు. వయోవృద్ధులు దైవంతో సమానమని, ఉద్యోగులు వారి తల్లిదండ్రులను చూడకపోతే వారి నెల జీతం నుంచి 10శాతం వేతనం కోత విధించి, తల్లిదండ్రులు ఖాతాలో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహ, విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు వెంకటేశం, బాలేశ్వర్, రాధాకృష్ణరావు, అంజయ్య, సీడీపీవోలు శైలజ, సమీరా, యామిని తదితరులు పాల్గొన్నారు.

కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు

● మహిళల ఆర్థిక భరోసాకు కట్టుబడి ఉన్నాం ● కలెక్టర్లు, మహిళా సమాఖ్య సభ్యులతో కాన్ఫరెన్స్‌లో సీఎం



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు, మహిళలు



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలుఉ అందజేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని కోటిమంది మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ లక్ష్యంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమం ప్రారంభించిన అనంతరం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, మహిళా సమాఖ్యసభ్యులతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మహిళలకు చీర, సారె పెట్టడం తెలంగాణ సాంప్రదాయమని, అందుకు అనుగుణంగా రాష్ట్రంలోని ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. చీరల పంపిణీకి నియోజకవర్గానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించి, మండలాల్లో ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో విడతలవారీగా ఇందిరమ్మ చీరల పంపిణీని పండుగ వాతావరణంలో చేపట్టాలన్నారు. నేటి నుంచి డిసెంబరు 9 వరకు గ్రామీణ ప్రాంతాల్లో, మార్చి 1 నుంచి 8 వరకు పట్టణ ప్రాంతాల్లో చీరల పంపిణీ కొనసాగుతుందని, అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడానికి కట్టుకున్న కంకణంకోసం ముందుకు వెళ్తుందన్నారు. కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో 1,91,811 మంది సంఘ సభ్యులు

ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ హనుమంతరావు అధికారుల, మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశమై మాట్లాడారు. జిల్లాలో 1,91,811 మంది సంఘ సభ్యులు ఉన్నారని, 1,80,769 మందికి ఇప్పటివరకు ఇందిరమ్మ చీరలు వచ్చాయన్నారు. ముందుగా గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ జరుగుతుందని, వాటికి మండల గ్రామస్థాయిలో ఒక కమిటీనీ ఏర్పాటు చేస్తామన్నారు. చీరలు పంపిణీ చేయగానే సంబంధిత మహిళల ముఖ గుర్తింపు వివరాలను పంపించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, జడ్పీ సీఈవో శోభారాణీ, ఆర్డీవో కృష్ణారెడ్డి, డీఆర్డీవో నాగిరెడ్డి, డీపీఎంలు, ఏపీఎంలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మేమింతే!

● ప్రతీ డాక్యుమెంట్‌కు ఓ రేటు
● ప్రభుత్వ ఆదాయానికి గండి



నల్లగొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అవినీతి అక్రమాలకు అడ్డులేదన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. అడపాదడప ఏసీబీ దాడులు జరుపుతున్నా కొందరూ అధికారుల్లో మార్పు రావడం లేదన్న విమర్శలున్నాయి. ఇటీవల మిర్యాలగూడలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన అవినీతి తంతంగం చూస్తుంటే యథేచ్ఛగా అక్రమాల దందా కొనసాగుతుందన్న ఆరోపణలున్నాయి. ఏసీబీ అధికారుల తనిఖీలో మిర్యాలగూడ సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు అంతేలేకుండా పోతుందనేది వెలుగులోకి వచ్చింది. ప్రధానంగా డాక్యుమెంట్ రైటర్లు, వారి అనుచరులు ఆ కార్యాలయంలో రాజ్యమేలుతున్నారనేది బయటపడింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భువనగిరి, బీబీనగర్, చండూరు, చౌటుప్పల్, దేవరకొండ, హుజూర్‌నగర్, కోదాడ, మిర్యాలగూడ, మోత్కూరు, నకిరేకల్, నల్లగొండ, నిడమనూరు, రామన్నపేట, సూర్యాపేట, యాదగిరి గుట్ట సబ్ రిజిస్ట్రార్‌లు ఉన్నాయి. ఇందులో పలు కార్యాలయాల్లో పలు కార్యాలయాలల్లో డాక్యుమెంట్ రైటర్లు ఏకంగా షాడో సబ్ రిజిస్ట్రార్‌లుగా వ్యవహరిస్తూ పనులను చక్కబెట్టుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వాస్తవానికి డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయంలోకి వెళ్లకుండా బయటి నుంచే ఆయా కౌంటర్ల ద్వారా డాక్యుమెంట్లు అందించాల్సి ఉన్నప్పటికీ ఏకంగా కార్యాలయంలోని కంప్యూటర్ రూమ్‌లోకి వెళ్లి అనేక పనులు చేసుకోవడంతో పాటు పెత్తనం చెలాయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని సీనియర్ డాక్యుమెంట్ రైటర్లు సబ్ రిజిస్ట్రార్‌లను సైతం బ్లాక్‌మెయిల్ చేస్తూ తమ అక్రమ డాక్యుమెంట్లను చక్కబెట్టుకున్నట్లు చర్చ సాగుతోంది. కొందరూ సబ్ రిజిస్ట్రార్‌లు ఏకంగా సీనియర్ డాక్యుమెంట్ రైటర్లు ఏమి చెబితే ఆ పని చేసి పెడుతుండటం గమనార్హం. అదేవిధంగా లేఅవుట్‌లు లేకుండా, ఎల్ఆర్ఎస్ లేకుండా కూడా కొంతమంది సబ్‌రిజిస్ట్రార్‌లు రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్నిచోట్ల ఎల్ఆర్ఎస్ లేకపోతే గజానికి రూ.100 చొప్పున రేటు కట్టి ఆయా ప్లాట్‌లకు రిజిస్ట్రేషన్ చేస్తుండటంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడటం ఆయా ఎస్ఆర్‌వోలకు అదనపు ఆదాయం సమకూరడం జరుగుతుంది. ఇకపోతే నల్లగొండ జిల్లాలో ఒక సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, సూర్యాపేట జిల్లాలో ఒక సబ్ రిజిస్ట్రార్, యాదాద్రి జిల్లాలోని ఒక సబ్ రిజిస్ట్రార్‌లో సీనియర్ అసిస్టెంట్‌లే ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌లుగా వ్యవహరిస్తున్నారు.

డాక్యుమెంట్‌కో రేటు

ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.500 నుంచి రూ.1000 వసూలు చేస్తుండగా ఈసీలకు, సీసీలకు రూ.300 నుంచి రూ.400, మ్యారేజీ సర్టిఫికెట్లకు రూ.1000 నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. డబ్బులు ఇవ్వని డాక్యుమెంట్లను పెండింగ్‌లో పెట్టడం పరిపాటిగా మారిందన్న విమర్శలున్నాయి.

నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నాం

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



భూమి పూజలో పాల్గొన్న విప్ అయిలయ్య

రాజాపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): లోవోల్టేజీ లేకుండా రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం రాజాపేట మండలం దూదివెంకటాపూర్‌లో రూ.4కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైతుల సమస్యలను పట్టించుకోలేదని, శిలాఫలకాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. రెండు నెలల్లో సబ్‌స్టేషన్ పనులు పూర్తయి నాలుగు గ్రామాల రైతులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. మండలకేంద్రంలో ఇందిరాగాంధీ విగ్రహానికి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిత, విద్యుత్ అధికారులు సుధీర్‌కుమార్, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, అనిల్‌కుమార్, నాయకులు మహేందర్‌గౌడ్, చిల్వేరు బాలరాజు, బుడిగె పెంటయ్య గౌడ్,శ్రీశైలం, నీలం పద్మ, బుచ్చిరెడ్డి, అయిలయ్య, కేదారి, బక్కయ్య, పాల్గొన్నారు.

గొలుసుకట్టు కాల్వలకు మరమతులు

యాదగిరిగుట్ట రూరల్: నియోజకవర్గవ్యాప్తంగా గొలుసుకట్టు కాల్వలకు మరమ్మతులుచేసి గొలుసుకట్టు చెరువులన్నీ నింపి రైతులకు అండగా ఉంటామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం మండలంలోని గౌరాయిపల్లి గ్రామంలో గౌరాయిపల్లి నుంచి కాచారం వరకు గొలుసుకట్టు చెరువు కాల్వకు రూ.15లక్షలతో మరమతులు చేసే కాల్వకు భూమిపూజ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జిన్న హరినాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మండల అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, నాయకులు ఎడ్ల రాంరెడ్డి, గుండ్లపల్లి భరత్‌గౌడ్, పన్నీరు భరత్, సిరికొండ నర్సింహులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

బొమ్మలరామారం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని డీఈవో సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల క్రీడల సమాఖ్య 69వ క్రీడలను భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ రాజేష్ పైలెట్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు జాతీయ స్థాయిలోనూ రాణించాలన్నారు. గెలుపొందిన విద్యార్థులకు స్థానిక ఎంఈవో రోజారాణి బహుమతులను అందజేశారు. ప్రథమ స్థానంలో సూర్యాపేట బాలికలు, రెండో స్థానంలో నల్లగొండ, మూడో స్థానంలో భువనగిరి విద్యార్థులు నిలిచారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ దశరథరెడ్డి, మండల సెక్రటరీ నరసింహ, ధనలక్ష్మి, సంగీత, సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తూకంలో తేడాలు వస్తే చర్యలు

● జిల్లా తూనికలు, కొలతల అధికారి వెంకటేశ్వర్లు

బొమ్మలరామారం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో తూకంలో తేడాలు వస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా తూనికలు, కొలతల అధికారి కందగడ్ల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రైతులకు తూకం వేసే క్రమంలో తేడాలు రావొద్దని సెంటర్ నిర్వాహకులకు సూచించారు.

రాజేష్ కుటుంబానికి న్యాయం చేయాలి

- ధర్మ సమాజ్‌పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్
- ఇందిరమ్మ ఇల్లు, మునిసిపాలిటీలో ఉద్యోగం ఇస్తామని ఆర్డీవో హామీ
- మంత్రి హామీ ఇవ్వాలని డిమాండ్.. కొనసాగుతున్న ఆందోళన



మాట్లాడుతున్న ధర్మసమాజ్ పార్టీ నాయకుడు విశారదన్ మహారాజ్

కోదాడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ చెక్కుల దుర్వినియోగంలో అరెస్టై మృతిచెందిన కర్ల రాజేష్ కుటుంబానికి న్యాయం చేయాలని సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో బుధవారం కూడా ఆందోళన కొనసాగింది. రాజేష్(30) హుజూర్‌నగర్ సబ్‌జైలులో అస్వస్థతకు గురై చికిత్సకోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లగా గాంధీ ఆస్పత్రిలో ఈ నెల 15వ తేదీన మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని ఈనెల 16న కోదాడకు తీసుకువచ్చారు. పోలీసులు కొట్టడంతోనే రాజేష్ మృతిచెందాడని బంధువులు, మంగళవారం డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఉద్యోగం ఇస్తామని ఆర్డీవో హామీతో బంధువులు వెనుదిరిగారు. తమకు తగిన న్యాయం జరగలేదని రాజేష్ కుటుంబసభ్యులు బుధవారం మళ్లీ ఆందోళన చేపట్టారు. ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ కోదాడకు చేరుకొని రాజేష్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. రాజేష్ కుటుంబానికి కోటి రూపాయల నగదు, ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేంత వరకు అంత్యక్రియలు చేపట్టేది లేదని స్పష్టం చేశారు. దీంతో కోదాడ పట్టణంలోని గాంధీనగర్‌లో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం 12గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఆందోళన కొనసాగిం ది. డిమాండ్లు నెరవేరిస్తేనే ఆందోళనను విరమిస్తామని రాజేష్ బంధువులు, విశారదన్ మహారాజ్ పేర్కొన్నారు. ఆర్డీవో ఆందోళనకారుల వద్దకు చేరుకొని ఆందోళన విరమించాలని కోరారు. రాజేష్ కుటుంబంలో ఒకరికి మునిసిపాలిటీలో ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ రాజేష్ బంధువులు ఆందోళన విరమించలేదు. కలెక్టర్, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి వచ్చి హామీ ఇవ్వాలని, లేనిపక్షంలో ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ శివశంకర్ గాంధీనగర్‌లో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తారు. రాత్రి కూడా ఆందోళన కొనసాగుతూనే ఉంది.

చిత్తుకాగితాలు ఏరుకుంటూ ఇళ్లలో చోరీలు

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 19,(ఆంధ్రజ్యోతి): పనికిరాని వస్తువులు, కాగితాల ఏరివేత పేరుతో ఆరుగురు మహిళలు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని చొల్లేరు గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చొల్లేరు గ్రామానికి బుధవారం జనగాం జిల్లాకేంద్రానికి చెందిన ఆరుగురు మహిళలు ఆటోలో వచ్చి పనికిరాని వస్తువులు, కాగితాల పేరుతో ప్లాస్టిక్ ఖాళీ బస్తాలు చేత పట్టుకొని గ్రామంలో ఆయా కాలనీలో తిరిగారు. తాళాలు వేసిన ఇళ్లలో తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇళ్లలో ఇత్తడి బిందెలు, నీళ్ల కరెంట్ మోటర్, ఇతర ఇత్తడి సామగ్రిని బస్తాల్లో నింపుకొని ఆటోలో ఎక్కించారు. దీనిని గమనించిన గ్రామస్థులు అనుమానంతో వారి ప్రశ్నించారు. బస్తాల్లో ఏమి ఉన్నాయని నిలదీశారు. బస్తాల్లో చూడగా సుమారు 20ఇత్తడి బిందెలు, ఇతర వస్తువు లు, కరెంట్ మోటర్ కన్పించాయి. వారికి అడ్డుకొని పోలీసులకు అప్పగించారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి

అనంతగిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని పాలారం గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన భూక్య నాగరాజు(42) మట్టపల్లి కోటయ్య వద్ద 15సంవత్సరాలుగా వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం నాగరాజు కృష్ణాపురం గ్రామ శివారులోని జీడయ్య పొలంలోని ఎనిమిది ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌లో వేసుకొని వస్తున్నాడు. రాత్రి 7గంటల సమయంలో ట్రాక్టర్ లైట్లు పనిచేయకపోవడంతో నాగరాజు తన వద్ద ఉన్న సెల్‌ఫోన్ లైట్ వేసి ఒంటిచేతో డ్రైవింగ్ చేస్తున్న క్రమంలో పాలారం గ్రామ శివారులోని శ్మశానవాటిక వద్ద రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పలు కనబడకపోవడంతో ట్రాక్టర్ ఎడమ టైరు ధాన్యంపైకి ఎక్కి అదుపు తప్పి కాల్వలో పడిం ది. దీంతో నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. జీడయ్యకు కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా నాగరాజు అప్పటికే మృతిచెందాడని డాక్టర్లు తెలిపారు. జీడయ్య చికిత్స పొందుతున్నాడు. నాగరాజు భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

చికిత్సపొందుతూ...

నాగారం: సూర్యాపేట జిల్లా నాగారం బంగ్లా వద్ద జాతీయ రహదారిపై ఈ నెల 15వ తేదీన జరిగిన కారు ప్రమాదంలో కానిస్టేబుల్ కమలాకర్ మృతిచెందిన విషయం విదితమే. అతడితో పాటు తీవ్రంగా గాయపడిన పెరుమాండ్ల ఆశోక్‌రావు(40) హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్సపొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతిచెందారు. కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన కారును, డ్రైవర్‌ను త్వరలోనే పట్టుకుంటామని సీఐ నాగేశ్వరరావు తెలిపారు.

సాగర్ నీటి మట్టం 585.50 అడుగులు

నాగార్జునసాగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.0450 టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రానికి 585.50 అడుగులుగా (298. 8775టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 4,160 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వా రా 600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 14,760క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా, ఎగువ నుంచి నీటి రాక లేదు.

బహురూపి బియ్యం వాడితే ఆరోగ్యం

- అంతరిస్తున్న వరి వంగడాలకు ఆయుష్షు పోస్తున్న యువ రైతు
- దేశంలోని వివిధ ప్రాంతాలు తిరిగి విత్తనాల సేకరణ
- కుటుంబం కోసం ఓ రైతు సాగు

పూర్వం రోజుల్లో బలవర్ధక ఆహారాన్ని అందించిన వరి వంగడాలు(బియ్యం) నేడు కను మరుగయ్యాయని, వాటిని తిరిగి వాడుకలోకి తీసుకరావడానికి కృషి చేస్తున్నాడు యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రానికి చెందిన యువ రైతు బిల్లపాటి గోవర్ధన్‌రెడ్డి. అందుకోసం నాలుగేళ్లుగా దేశంలోని వివిధ ప్రాంతాలు తిరిగి విత్తనాలు సేకరిస్తున్నాడు. ఈ ఏడాది 23రకాల వరి వంగడాల విత్తనాలు సేకరించి విత్తన బ్యాంకు కోసం ఒక్కో గుంట విస్తీర్ణంలో వాటిని సాగు చేశాడు. నాలుగేళ్లుగా తాము పండించుకున్న బహురూపి బియ్యం తింటున్నామని, తమ కుటుంబం ఆరోగ్యంగా ఉందని చెప్పాడు.



అభిరుచి

బహురూపి వరి పొలం

● ఆంధ్రజ్యోతి, మోత్కూరు

పూర్వకాలంలో జన్యు సంక్రమణ లేకుండా పండించిన వివిధ రకాల వరి పంటలు తినడం వల్ల మనుషులు ఆరోగ్యంగా ఉండేవారు. అధిక దిగుబడి కోసం హైబ్రీడ్ విత్తనాలు తయారు చేయడం, వాటిని రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడి పండిస్తుండటంతో వాటి అవశేషాలు బియ్యంలో ఉండి ఆరోగ్యం దెబ్బతిని ఆస్పత్రుల పాలవుతున్నామన్నది జగమెరిగిన సత్యమే అయినా మార్పు కోసం ఎవరూ ప్రయత్నించడం లేదంటున్నాడు. రైతులు వారి కుటుంబానికి అవసరమైనంత పంటనైనా పూర్వ వరి వంగడాలు పండించుకుని తిన్నారు. బహురూపి వరి వంగడంతో పండిచిన బియ్యం తింటే ఆరోగ్యంగా ఉండొచ్చని పేర్కొంటున్నాడు రైతు గోవర్ధన్‌రెడ్డి.

23 రకాల వరి వంగడాల సాగు

గతంలో నాలుగు రకాల వరి వంగడాలను పండించానని, విత్తన బ్యాంకు కోసం ఈ సారి ఒక్క గుంట విస్తీర్ణంలో 23రకాల వరి వంగడాలు సాగుచేశానని గోవర్ధన్‌రెడ్డి తెలిపాడు. కాలానమ్మక్, కాలాబట్టి, కృష్ణవ్రీహీ, నారాయణ కామిని, బహురూపి, తులంపంజి, సీరగసాంబ, ఇంద్రాణి, పొక్కూర్, మాపల్లై సాంబ, ఇల్లపు సాంబ, మట్టరైస్, తూయపల్లి, కాలజీర, పూంగార్, చిట్టిముత్యాలు, మణిపూర్‌బ్లాక్, చికిలకోయిల, కబిరాజ్‌పాల్(డాక్టర్ రైస్), రాజముడి, కర్పుకవణి, గరుడన్‌సాంబ, కరుంగ్‌కురువై వంగడాలను ఆయన సాగు చేశాడు. కాలానమ్మక్ గౌతమ బుద్ధుని కాలం నాటిదని, బహురూపి బియ్యం శ్రీకృష్ణదేవరాయలు ఇష్టంగా తినేవారని, రాజముడి రైస్‌ను మైసూరు మహారాజులు తినేవారని, కబిరాజ్‌పాల్ రైస్‌ను డాక్టర్ రైస్ అంటారని, వాటిని ఇప్పటికీ పశ్చిమ బెంగాల్‌లో ట్రైబల్ ఏరియాలో తింటున్నారని, వాటిని తింటే డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన పని ఉండదని చెబుతారని చెబుతున్నాడు. ఈ వంగడాల్లో అత్యధికం వివిధ రకాలు మెడిసిన్ వ్యాల్యూ ఉన్నవేనంటున్నాడు. కాలాబట్టి, మణిపూర్ బ్లాక్ క్యాన్సర్ నిరోధక శక్తి కల్గినవని, నారాయణ కామిని మోకాళ్లనొప్పుల నివారిస్తుందని, ఇల్లపుసాంబ మైగ్రేన్ సమస్యను తగ్గిస్తుందని, పూంగార్ రైస్‌లో కాల్షియం, ఐరన్ ఎక్కువగా ఉంటుందని, చికిలకోయిల రైస్ కిడ్నీ సంబంధిత వ్యాధులను నివారిస్తుందని, ఇలా ప్రతి వంగడంలో ఏదో ఓ ప్రత్యేకత ఉందంటున్నాడు.

దిగుబడి తక్కువైనా... ధర ఎక్కువ

హైబ్రీడ్ వరి వంగడాలతో పోల్చుకుంటే పురాతన వరి వంగడాల దిగుబడి తక్కువ. అయినా రేటు ఎక్కువగా ఉంటుందన్నాడు. ఎకరాకు 15నుంచి 20 బస్తాల దిగుబడే వస్తుందన్నాడు. బియ్యం ధర క్వింటాల్‌కు రూ.పది వేల వరకు ఉంటుందని తెలిపారు. ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకుండా సేంద్రియ ఎరువులు, జీవామృతం, కషాయాలు మాత్రమే వాడుతున్నందున పెట్టుబడి కూడా తగ్గుతుందన్నారు గోవర్ధన్‌రెడ్డి.

ఇంటి కోసమైనా ఈ వంగడాలు సాగుచేయాలి



ఈ విత్తనాలు సేకరించడానికి సుమారు రూ.20 వేలు ఖర్చు చేశాను. నేను నాలుగేళ్లుగా సాగు చేస్తున్న బహురూపి బియ్యం తింటున్నాను. కూరగాయలు కూడా సేంద్రీయ పద్ధతిలోనే పండించుకుంటున్నాం. ప్రతి రైతు మన పూర్వీకులు ఎందుకు అంత బలంగా ఉండేవారో ఆలోచించాలి. ఆనాటి వరి (బియ్యం)లో బలమైన పోషకాలు ఉండేవి అన్నది గ్రహించాలి. ప్రతి రైతు అమ్మడానికి కాకపోయిన తన ఇంటి అవసరాలకోసమైనా పాత వరి వంగడాలను సాగు చేయాలి. వారు ఆరోగ్యంగా ఉంటారు. గతంలో ఏనాడు లేనంతగా బీపీలు, షుగర్లు, గుండెపోట్లు, కిడ్నీ సమస్యలు ఇప్పుడు రావడానికి కారణం మనం తినే మందుల తిండే.

● బిల్లపాటి గోవర్ధన్‌రెడ్డి, రైతు.



కాలానమ్మక్ వరి పొలం

న్యాయం చేయాలని ఆందోళన

- వైద్యుడి నిర్లక్ష్యంతో మహిళ మృతిచెందిందని ఆరోపణ
- పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన
- సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఘటన

తిరుమలగిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వైద్యుడి నిర్లక్ష్యంతో వైద్యం వికటించి మహిళ మృతిచెందిందని ఆరోపిస్తూ. కుటుంబసభ్యులు సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ వద్ద మృతురాలి బంధువులు, కుటుంబ సభ్యులు బుధవారం ఆందోళన చేశారు. మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కొడకండ్ల మండలం బోడోనికుంటతండాకు చెందిన ధరావత్ రాజు భార్య వినోద(36)కు తిరుమలగిరిలోని వెన్నెల ఆస్పత్రిలో ఐదు నెలల క్రితం ఆపరేషన్ చేసి గర్భసంచి తొలగించారు. ఆపరేషన్ చేస్తున్న సమయంలో తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే డాక్టర్ ఆమెను హన్మకొండలో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు పంపించారు. అక్కడ పరీక్షించిన డాక్టర్లు మూత్రనాళం కట్ అయిందని చెప్పారని, ఆమెకు తిరుమలగిరిలో వైద్యం చేసిన డాక్టరే వైద్య ఖర్చుల కోసం సుమారు రూ2లక్షలు హన్మకొండ హాస్పిటల్‌లో చెల్లించాడని తెలిపారు. ఇంటికి వచ్చి వైద్యం అందించాడని తెలిపారు. ఐదు నెలలుగా వైద్యం అందిస్తున్నామని అయినా కోలుకోకపోవడంతో పరిస్థితి విషమంగా మారడంతో సోమవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లామని చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి వినోద మృతిచెందిందని తెలిపారు. న్యాయం చేయాలని తిరుమలగిరిలోని ఆస్పత్రికి వస్తే వినోద మృతిచెందిన విషయం తెలిసి ఆస్పత్రి మూసేసారని, న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. వైద్యం చేస్తున్నప్పుడు వైద్యుడి నిర్లక్ష్యంతో వినోద మృతిచెందిందని కుటుంబసభ్యులు ఆరోపించారు. వినోదకు ఇద్దరు కుమార్తెలు, ఒకుమారుడు ఉన్నారు. వినోదకు తాను వైద్యం చేయలేదని, హైదరాబాద్ నుంచి స్పెషలిస్ట్ డాక్టర్‌ను పిలిపించి గర్భసంచి ఆపరేషన్ చేయించినట్లు డాక్టర్ మురళీధర్ తెలిపారు. ఆపరేషన్ చేస్తున్నప్పుడు ఆమెకు కాన్సర్ ఉన్నట్లు తెలిసిందని, ఆపరేషన్ చేసిన డాక్టర్ క్యాన్సర్ వైద్యం చేయించుకోవాలని సూచించినట్లు తెలిపారు. సుమారు మూడు గంటల పాటు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. పోలీసులు ముందుస్తుగా నాగారం సర్కిల్ పోలీసులను తిరుమలగిరికి రప్పించారు. ఇరు పరక్షాల పెద్దమనుషుల సమక్షంలో, మృతురాలి కుటుంబసభ్యులకు రూ.3 లక్షల నష్టపరిహారం చెల్లించేందుకు వైద్యుడు అంగీకరించినట్లు తెలిసింది.



పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న వినోద కుటుంబసభ్యులు

1800 కిలోల నల్ల బెల్లం, 80 కిలోల పటిక స్వాధీనం

కొండమల్లేపల్లి, నవంబర్ 19(ఆంధ్రజ్యోతి : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల పరిధిలోని చెన్నారం గేటు వద్ద ఎక్సైజ్ పోలీసులు బుధవారం నల్ల బెల్లం, పటిక స్వాధీనం చేసుకున్నారు. దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... వాహన తనిఖీలలో చెన్నారం గేటు నుంచి కొండమల్లేపల్లికి వెళ్లే రోడ్డు మార్గంలో అశోక్ లేలాండ్ మినీ వాహనంలో ఇద్దరు వ్యక్తులు 1800 కిలోల నల్ల బెల్లం, 80 కిలోల పటిక తరలిస్తున్నారు. అనుమానంతో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో నల్లబెల్లం, పటిక లభించింది. దీంతో దేవరకొండ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ తనిఖీలో ఎక్సైజ్ ఎస్ఐ నరసింహ, వీరబాబు, కానిస్టేబుల్ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన హంగులు.. సాంకేతికత తోడు

- గరిడేపల్లి పోలీస్‌స్టేషన్ రూపురేఖలు మార్చిన ఎస్ఐ నరేష్
- పోలీస్‌స్టేషన్ పరిధిలో 57 సీసీ కెమెరాలు ఏర్పాటు



ఆదర్శం

పోలీస్‌స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ రూంను ప్రారంభిస్తున్న ఎస్పీ నర్సింహ(ఫైల్)

గరిడేపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అది సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పోలీస్‌స్టేషన్.. గతంలో అరకొర వసతులతో ఉన్న స్టేషన్‌ను నూతన హంగులతో తీర్చిదిద్దారు ఎస్ఐ చలికంటి నరేష్. దానికి తోడు సాంకేతితకను ఉపయోగించి పోలీస్‌స్టేషన్ పరిధిలో 57సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. అక్కడే మానిటరింగ్ కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయించారు. సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఏడు పోలీస్‌స్టేషన్లలో పైలెట్ ప్రాజెక్ట్ కింద తీసుకొని 150సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ ప్రకటించారు. ఒక్క గరిడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోనే ఎస్ఐ నరేష్ 57 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. స్టేషన్‌లోనే మానిటరింగ్ కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయించి ఎస్పీ కె. నర్సింహతో ప్రారంభించి మానిటరింగ్ చేయిస్తున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో సౌకర్యాలపై దృష్టి

ఫిర్యాదుదారులు కూర్చొనేందుకు వీలుగా ఒక గది ఏర్పాటు చేశారు. గతంలో వర్షం వస్తే పోలీస్‌స్టేషన్ కురవడంతో పాటు వారం రోజుల పాటు వర్షం నీరు నిలిచేది. పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో 15టిప్పర్ల మొరం పోయించి వర్షం నీరు నిల్వకుండా డ్రైయినేజీలోకి వెళ్లేలా ఏర్పాటు చేశారు. కోదాడ, మిర్యాలగూడ హైవే-167 రహదారి మండలంలో సుమారు 13కిలోమీటర్ల మేర ఉంది. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతుండేవి. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ స్టాప్ బోర్డులు ఏర్పాటు చేయించి ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నారు.



నూతన హంగులతో ఏర్పాటైన పోలీస్‌స్టేషన్

నిరంతర నిఘా..

గతంలో అరకొరగా సీసీ కెమెరాలు ఉన్నా అవి పనిచేసేవి కావు. దాతల సహకారంతో ప్రస్తుతం గరిడేపల్లిలో 25, మండలంలోని వివిధ గ్రామాల్లో 27 కలిపి మొత్తం 57 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. గరిడేపల్లి పోలీస్‌స్టేషన్ నిర్మించి సుమారు 45సంవత్సరాలు కావొస్తోంది. గతంలో స్టేషన్‌లోని సౌకర్యాలు ఉండేవికావు. సిబ్బంది విశ్రాంతి తీసుకోవడానికి, వారి వాహనాలు నిలుపుకునేందుకు కూడా సరైన వసతి ఉండేది కాదు. ఎస్‌గా చలికంటి నరేష్ బాధ్యతలు తీసుకున్నాక పోలీస్‌స్టేషన్ రూపురేఖలు మార్చేశారు.

పోరాడారు.. రోడ్డు సాధించారు

- సూర్యాపేటలో మహిళల ధర్నా
- రెండు గంటల వ్యవధిలోనే బీటీ రోడ్డు వేయించిన అధికారులు



సూర్యాపేట జిల్లాకేంద్రంలోని అంజనాపురి-జనగాం రోడ్డును కలిపే రహదారిపై ధర్నా చేస్తున్న మహిళలు

స్ఫూర్తి



నూతనంగా వేస్తున్న బీటీ రోడ్డు

భానుపురి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆ రోడ్డుపై నుంచి వెళ్లే వాహనాలతో వచ్చే దుమ్ముధూళి ఇళ్లలోకి వచ్చి స్థానికులు ఇబ్బందులు పడేవారు. సంవత్సరానికి పైగా పనులు కొనసాగుతుండడంతో నిత్యం ఇబ్బంది పడుతున్నామని స్థానిక మహిళల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దీంతో మహిళలంతా ఏకమై ఆందోళనకు దిగారు. దిగి వచ్చిన అధికారులు రెండు గంటల వ్యవధిలోనే రోడ్డు వేశారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని అంజనాపురి- జనగాం క్రాస్‌రోడ్డుకు వెళ్లే రహదారిపై దుమ్ముధూళి లేచి ఇళ్లలోకి వస్తోంది. వజ్రా వెంచర్‌కాలనీ మహిళలు, కాలనీవాసులు సమారు వంద మంది రెండు గంటల పాటు ధర్నా చేశారు. 365 జాతీయ రహ దారిపై ఉన్న జనగాం క్రాస్‌రోడ్డులో సంవత్సరం నుంచి బ్రిడ్జి నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. పట్టణానికి వరంగల్, జనగాం, తిరుమలగిరి వైపునుంచి వాహనాలు వస్తుంటాయి. ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు, బస్సులు, ద్విచక్రవాహనాలు జాతీయ రహదారి మీదుగా అంజనాపురి, జనగాం క్రాస్‌రోడ్డుకు రహదారి ఉంది. ఈ రహదారి ఇరుకుగా ఉన్నా వాహనాలు వెళ్తున్నాయి. సామర్థ్యానికి మించి మించి వాహనాలు లోడు తీసుకెళ్తండడం, రద్దీగా ఉండడంతో రోడ్డు ధ్వంసమైంది. ఆ రహదారిపై పురపాలక శాఖ ద్వారా కాంట్రాక్టర్ రెండు, మూడు సార్లు మరమ్మతులు చేశారు. రహదారి వేయడానికి కంకర డస్టు పోసి నెల దాటింది. ఈ రహదారిపై నిత్యం వాహనాలు తిరుగుతుండడంతో దుమ్ముధూళి ఇళ్లలోకి వస్తోందని, నిత్యం ఇబ్బంది పడుతుండడంతో వజ్రా వెంచర్ కాలనీలో నివాముండే మహిళలు బుధవారం ధర్నాకు దిగారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన చేశారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న మునిసిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి జాతీయ రహదారి కాంట్రాక్టర్‌కు వెంటనే రోడ్డు వేయాలని ఆదేశం చారు. దీంతో వాహనాల్లో బీటీ వేయడానికి డాంబర్ కలిపిన మెటీరియల్ తీసుకొచ్చి వేశారు. ఆందోళనకు స్పందించి అధికారులు పనులు చేయించడంతో సంతోషం వ్యక్తం చేశారు.

రోడ్డు బాగు చేయండి మహాప్రభో..

- మోత్కూరు మండలం పనకబండ చౌరస్తాలో మోకాళ్లపై నిల్చొని రాస్తారోకో



వినతి

మోకాళ్లపై నిల్చుని నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

మోత్కూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు పనకబండ చౌరస్తా నుంచి రాజగూడెం శివారు వరకు రోడ్డును వెంటనే బీటీగా మార్చాలి డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు బుధవారం ఆందోళన చేశారు. ఆ రోడ్డుపై మోకాళ్లపై నిల్చొని రాస్తారోకో నిర్వహించారు. పనకబండ చౌరస్తా నుంచి రాజన్నగూడెం శివారు వరకు సుమారు మూడున్నర కిలోమీటర్ల దూరం బీటీ చేయడానికి రూ.5.80 కోట్లు మంజూరై మూడేళ్ల అవుతున్నా రోడ్డు మాత్రం బీటీ చేయలేదని వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్ కొద్దిదూరం బీటీ చేసి పని వదిలేసి వెళ్లిపోయాడని, అధికారులు వేరే కాంట్రాక్టర్‌తో పనులు చేయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గుంతలమయమైన రోడ్డుపై ఆర్టీసీ బస్సుల్లో, ఇతర వాహనాల్లో వెళ్తున్నప్పుడు కుదుపులకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు పడి గాయాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డును బీటీ చేయడంతో పాటు అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఇందిరానగర్ కాలనీ వరకు మోత్కూరు-నార్కట్‌పల్లి రోడ్డులో డివైడర్ వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు చాడ మంజులరెడ్డి, ఉపాధ్యక్షుడు కందుకూరి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి అన్నెపు సత్యనారాయణ, ముత్తినేని తిరుమలేష్, బొట్లు అబ్బయ్య, గౌరు శ్రీనివాస్, పోచం సోమయ్య, దీటి సందీప్, బద్దం మహేందర్‌రెడ్డి, మనోహర్, రేణుక, సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సాదాబైనామాల క్రమబద్ధీకరణ సవాలే

» సాంకేతిక సమస్యలతో సతమతం
» మిర్యాలగూడ డివిజన్‌లో 60 శాతం క్లియరెన్స్

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

తెలిసో, తెలియకో తెల్లకాగితంపై ఒప్పందం చేసుకుని(సాదాబైనామా) భూములు కొనుగోలు చేసిన వారి సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా అధికారులు ప్రయత్నిస్తున్నప్పటికీ సవాళ్లు తప్పడం లేదు. చిన్న రైతులకు ఊరట కలిగించే దిశగా ప్రభుత్వం సాదాబైనామాల భూములను 2025 భూభారతి చట్టం ద్వారా క్రమబద్ధీకరించే ప్రకియను చేపట్టింది. అయితే సాదాబైనామా రిజిస్ట్రేషన్ ప్రక్రియ రెవెన్యూ అధికారులకు సంక్లిష్టంగా మారింది. కొన్ని సాంకేతిక సమస్యలతో దరఖాస్తులను పరిష్కరించలేక అధికారులు పెండింగ్ పెడుతున్నారు. ప్రభుత్వ భూ ములు కొనుగోలు చేసిన వారికి, విక్రయించిన పేరున డాక్యుమెంట్లు లేకపోవడం, కుటుంబ పెద్ద విక్రయించిన భూమిని అనంతరం కాలంలో వారుసుల పేరున మారడం, ప్రభుత్వ భూమిని కొనుగోలు చేయడం లాంటి కారణాలతో సాదాబైనామాల దరఖాస్తుల పరిష్కారం త్వరగా పూర్తి కావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాదాబైనామా దరఖాస్తుల క్రమ



బద్ధీకరణకు భూమి విక్రయించిన యజమాని తహసీల్దార్ కార్యాలయానికి హాజరుకావాలని రెవెన్యూ అధికారులు తేల్చి చెప్పడంతో సమస్య మళ్లీ మొదటికి వస్తుందని కొనుగోలుదారులు పేర్కొంటున్నారు.

సవాల్‌గా మారుతున్న సమస్యలు

భూభారతి చట్టం-2025లోని సెక్షన్-6 ప్రకారం 2014 జూన్ 2 నాటికి ముందుగా సాగులో ఉన్నారని ఆధారాలు చూపగలిగితే ఆ రైతుల భూ మిని రెగ్యులరైజ్ చేసే వీలుంది. అమ్మకం కొనుగోలు మాత్రమే సాదాబైనామాలో చెల్లుబాటు అవుతుండగా గిఫ్ట్‌గా ఇచ్చిన వాటిని చెల్లుబడి కావడం లేదు. సాదాబైనామాల క్రమబద్ధీకరణలో ఐదు ఎకరాలలోపు వ్యవసాయ భూముల కలిగిన రైతులు రేషన్ కార్డు కలిగిన వారికే సాదాబైనామాల క్రమబద్ధీకరించుకునే వీలుంది. ఎకరం గతంలో ఉండి మరో ఐదెకరాలు కొన్నవారికి ఇది వర్తించదు. దరఖాస్తు తిరస్కరించబడుతుంది. రెవె న్యూ అధికారులు రేషన్‌కార్డు ప్రామాణికంగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. రీ సర్వే సెటిల్‌మెంట్ రిజిష్టర్(ఆర్ఎస్ఆర్) ప్ర కారం ఆన్‌లైన్‌లో అమ్మినవారి పేరులేక పోయినట్లయితే ఆ దరఖాస్తులు కూడ తిరస్కరణకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. పీవోబీ, పీవో టీలో ఉన్న భూములకు సాదాబైనామా వర్తించే పరిస్థితి లేదు. దీనివల్ల భూములు ఉంది సాగు చేసుకుంటున్నప్పటికీ ప్రభు త్వం ఇచ్చే రాయితీలు అందడం లేదు. బ్యాంకుల నుంచి రుణాలు పొందలేక పోతున్నట్లు తెలిపారు. రైతుబంధు సాయం దక్కడం లేదని రైతు బీమా పథకం, ప్రధాన మంత్రి కిసాన్ యోజనకు అర్హులం కాకుండా పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చివరకు సేల్ డెడ్‌నే దిక్కు

మిర్యాలగూడ మండల పరిధిలోని ఓ గ్రామంలో సొంత అన్న వద్ద నుంచి 15 ఏళ్ల క్రితం సుమారు 5 లక్షలకు ఎకరం చొప్పున 6 ఎకరాల వ్యవసాయ భూమి చెల్లె కొనుగోలు చేసింది. పెద్దమనుషుల సమక్షంలో ఓ కాగితంపై ఒప్పందం రాసుకున్నారు. నాటి నుంచి చెల్లెలు ఆ భూమిని సాగు చేసుకుంటూ వస్తోంది. సొంత అన్న అనే భావనతో రిజిస్ట్రేషన్ తరువాత చేయించుకుందామని వాయిదా వేసుకుంటూ వచ్చింది. కొంత కాలం ఆమె కూతురుకు వివాహం జరగగా సదరు భూమిని అమ్మాయి పేరున రిజిస్ట్రేషన్ చేస్తానని వాగ్దానం చేసింది. ఒప్పందం పత్రం తీసుకుని రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి భూమి రిజిస్ట్రేషన్ చేయమని అడిగితే పట్టాదారు పాస్ బుక్ తీసుకొనిరమ్మని చెప్పారు. అన్న దగ్గరకు వెళ్తే నా వద్ద అప్పుడు తక్కువ ధరకు భూమి కొన్నావు. ఇప్పుడు ధర పెరిగింది. ప్రస్తుతం నాకు రూ. 20 లక్షలు ఇస్తేనే తహసీల్దార్ వద్దకు వచ్చి సంతకం చేస్తానని బేరాలకు దిగాడు. విధిలేని పరిస్థితిలో గ్రామ పెద్దల సమక్షంలో రూ. 8 లక్షల 50వేలకు అన్నతో ఒప్పదం కుదుర్చుకుని డబ్బులు ఇచ్చి కూతురు పేరున సేల్‌డీడ్ చేయించుకుంది.

డివిజన్‌లో 13,185 దరఖాస్తులు

2020 అక్టోబరు 20 నుంచి నవంబరు 19 వరకు సాదాబైనామాల కోసం నల్లగొండ జిల్లా 28,313 దరఖాస్తులు చేసుకున్న మిర్యాలగూడ డివిజన్‌లో 13,185మంది దరఖాస్తు చేసుకున్నారు. అడవిదేవులపల్లి మండలంలో 410 దరఖాస్తులు, అనుముల 665, దామరచర్ల 1,600, మాడ్గులపల్లి1,885 మిర్యాలగూడ, 2,623, నిడమనూరు 654,పెద్దవూర 719, తిరుమలగిరి సాగర్ 1,865, త్రిపురారం 1,283, వేములపల్లి మం డలం నుంచి 1,481 దరఖాస్తులు చేసుకున్నారు.

సాదాబైనామా పరిష్కారంలో డివిజన్ ప్రథమ స్థానం



నల్లగొండ జిల్లా సాదాబైనామాల దరఖాస్తుల పరిష్కారంలో మిర్యాలగూడ డివిజన్ ప్రథమంలో వుంది. 13,185 దరఖాస్తుల్లో 6వేల దరఖాస్తులను పరిష్కరించడం జరిగింది. క్షేత్ర స్థాయిలో ఎదురౌవుతున్న సమస్యల వల్ల కొంత ఆలస్యం అవుతుంది. రెవిన్యూ యంత్రాంగం ప్రత్యేక చొరవతో సమస్యలను పరిష్కరిస్తుంది.

-నారాయణ అమిత్, సబ్‌కలెక్టర్,మిర్యాలగూడ

కొబ్బరికాయల వేలం రూ.43.50లక్షలు



ఎల్లారెడ్డిగూడెం గ్రామపంచాయతీలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

నార్కట్‌పల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఏడాది కాలపరిమితికి నిర్వహించిన కొబ్బరికాయల విక్రయ వేలం ధర రూ.43.50 లక్షలు పలికింది. ముందుగానే ప్రకటించిన మేరకు బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐదో పర్యాయం నిర్వహించిన బహిరంగ వేలానికి మొత్తం ఏడుగురు వేలందారులు హాజరయ్యారు. ఎల్లారెడ్డిగూడెనకు చెందిన పనస సతీష్ అత్యధికంగా రూ.43.50లక్షలు పాడారు. రెండవ పాటదారునిగా చిక్కుళ్ల శివ రూ.43.40లక్షలు పాడారు. టెండర్ అనుమతి కోసం డీపీవోకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో వెంకటేశ్వర్లు, జీపీ ప్రత్యేకాధికారి ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎంపీవో సుధాకర్, పంచాయతీ కార్యదర్శి చిరుమర్తి వెంకన్న, వడ్డే భూపాల్‌రెడ్డి, నల్ల వెంకన్న గ్రామస్థులు పాల్గొన్నారు.

కోతులను పట్టివేతకు శ్రీకారం

చౌటుప్పల్ టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కోతులను బోనుల ద్వారా పట్టించే కార్యక్రమానికి మునిసిపాలిటీ శ్రీకారం చుట్టింది. రెండు రోజుల్లో 82 కోతులను పట్టి అడవుల్లో వదిలివేశారు. పాఠశాలల వద్ద విద్యార్థులతో పాటు కాలనీలలో ప్రజలను, బాటసారులను కోతులు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. చేతుల్లో సంచులు కనిపిస్తే ఎగబడి దాడి చేస్తున్నాయి.

అంతేకాక ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. పట్టణంలో తిరుగుతున్న కోతులను పట్టించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని, అందుకు ప్రజలు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ జి. వెంకట్రాంరెడ్డి కోరారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు కోతులను పట్టించే కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో యాద'గిరి' ప్రదక్షిణ

• భజన కీర్తనలతో సాగిన నడక యాత్ర



గిరిప్రదక్షిణ పూర్తి చేసుకొని స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

యాదగిరిగుట్ట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో బుధవారం స్వాతి నక్షత్ర వేడుకలు, సత్యదేవుని వ్రతాలు, కార్తీకదీపాలు వెలిగించి భక్తులు ఆధ్యాత్మిక తన్మయత్వం పొందారు. ఆలయంలో వేకువజామున అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. వైకుంఠద్వారం నుంచి సామూహిక గిరిప్రదక్షిణ వైభవంగా కొనసాగింది. తెల్లవారుజామున 5.30 గంటలకు అర్చకుల వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు హారతి సమర్పించి మొక్కులు చెల్లించి ప్రదక్షిణ ప్రారంభించారు. గిరిప్రదక్షిణ చేసిన భక్తులకు క్షేత్రం ఉత్తరదిక్కులో 1,500 ఉచిత దర్శన టికెట్లు అధికారులు పంపిణీ చేశారు. మధ్యాహ్నం ఆరగింపు సమయం (12 గంటలకు) వరకు సుమారు 30వేల మంది భక్తులు ప్రదక్షిణ పూర్తి చేశారు.

అధిక సంఖ్యలో భక్తుల రాక

యాదగిరిగుట్ట క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉభయ క్యూలైన్‌లో భక్తులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ ఉండగా ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనాలు, మధ్యాహ్నం ఆరగింపు సమయం కలిపి 3 గంటల పాటు వేచి ఉన్నారు. యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు పర్యవేక్షణలో పట్టణ ఇన్‌స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ సారథ్యంలో పోలీసులు భక్తులకు బందోబస్తు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామికి సువర్ణ పుష్పార్చన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శివాలయంలోనూ పూజలు కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 33,43,041 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కాగా, కొండకింద మండపాల్లో 760 మంది దంపతులు సత్యదేవుని వ్రతాలు జరిపించారు. స్వామిని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే.శివసేనరెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి ప్రధానార్చకుడు భట్టర్‌సురేంద్రాచార్యులు బృందం ఆశీర్వచనం అందజేశారు.

ఉద్యమాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం

● సీపీఐ జాతీయ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



నల్లగొండలో బస్సుయాత్ర నల్లగొండ చేరుకున్న సందర్భంగా మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

నల్లగొండరూరల్, చౌటుప్పల్‌టౌన్, గట్టుప్పల, చిట్యాల, నార్కట్‌పల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం జరుగుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సీపీఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఈ నెల 15న గద్వాల నుంచి ఖమ్మం వరకు కొనసాగుతున్న ప్రచార బస్సు జాత బుధవారం యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో వారు మాట్లాడుతూ సీపీఐ నూరేళ్ల చరిత్రను గ్రామగ్రామాన ప్రజలకు వివరించి చైతన్య పరుస్తున్నామని వారు అన్నారు. ఎన్నికల్లో చేసిన హామీలను ప్రభుత్వం అమలు చేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఐ 100ఏళ్ల ముగింపు ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో వచ్చే నెల 26వ తేదీన నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని వారు కోరారు. నల్లగొండలో బస్సుజాత పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. మర్రిగూడ బైపాస్ నుంచి గడియారం సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. జాతకు నాయకత్వం వహిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల నర్సింహ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌ను శాలువా పూలమాలలతో సన్మానించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ పెట్టుబడిదారులకు, భూసామ్య పెత్తందారులకు వ్యతిరేకంగా పేద ప్రజ ల పక్షాన నిలబడి సీపీఐ సమరశీల పోరాటాలు నిర్వహించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు మల్లేపల్లి ఆదిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, నాయకులు పబ్బు వీరస్వామి, బొ ల్లగిరి నర్సింహ, గురిజ రామచంద్రం, వెంకటేశ్వర్లు, కెఎస్ రెడ్డి, చాపల శ్రీను, అక్బర్, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు జగన్ పాల్గొన్నారు.

● చౌటుప్పల్‌లో ఈ జాతకు మునిసిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు సంఘీబావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎం.బాలనర్సింహ, జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్య క్షుడు కె.శ్రీనివాస్, నాయకులు బి.గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, ఇమ్రాన్, సుదర్శన్, భాస్కర్, మోహన్‌రెడ్డి, సంజీవ పాల్గొన్నారు.

● గట్టుప్పలలో భారీ ఎత్తున బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. మండలకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడు తూ దేశంలో అనేక పోరాటాలతో, త్యాగాలతో పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సీపీఐ పేదల పక్షాన నిలబడిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన చట్టాల కోసం నిరంతరం సీపీఐ పోరాటాలు నిర్వహించిందని అన్నారు. పత్తి కొ నుగోళ్ల విషయంలో సీసీఐ కొనుగోళ్లు ఎ కరానికి 7 క్వింటాళ్లకు పరిమితి చేయడాన్ని అయన విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుజ రామచంద్రం, తీర్పారి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి బీమనపల్లి రమేష్, చాపల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, జగన్, రాపోలు సత్తయ్య, యాదయ్య, లక్ష్మయ్య, ముత్యం పాల్గొన్నారు.

ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే 'ఆపరేషన్ కగార్'

ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ప్రచారజాత చిట్యాలకు చేరుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం సీపీఐ పోరాడుతుందని అ న్నారు. దేశస్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ అగ్రభాగాన ఉందన్నారు. వందేళ్ల చరిత్రలో ఎన్నో పోరాటా లు, త్యాగాలు ఉన్నాయని గుర్తుచేశారు. కమ్యూనిస్టుల అనైక్యత వల్లే బూర్జువా పార్టీలు రాజ్యమేలుతున్నాయని తెలిపారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రావణ్‌కుమార్, మండల కార్యదర్శి ఎండీ అక్బర్, బొడిగె సైదులు, ఎస్కే షరీఫ్, మునుకుంట్ల నాగయ్య, జిల్లా సత్యం, దేశగోని రావుల చినవెంకన్న, లింగయ్య, నర్సింహ పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో మాట్లాడుతూ అసమానతలు లే ని సామాజిక న్యాయం, మార్పు కోసం సీపీఐ పో రాటం చేసిందని ఎమ్మెల్సీ సత్యం అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్, నాయకులు వెంపటి శ్రీనివాస్, శ్రీపతి స్వామి, అక్బర్, నర్సింహ, నజీర్, షరీఫ్ పాల్గొన్నారు.

మాన్‌తండాలో శిశువిక్రయ కలకలం

● శిశుసంక్షేమ శాఖ ఫిర్యాదుతో పోలీసుల విచారణ
● నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో ఘటన

దామరచర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం మాన్‌తండాలో శిశు విక్రయం కలకలం రేగింది. దామరచర్ల సీడీపీవో చంద్రకళ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దామరచర్ల మండలంలోని మాన్‌తండాలో పిల్లలు లేని రెండు కుటుంబాల్లో ఓ కుటుంబం వద్ద 20 రోజుల వయసు ఉన్న పాప, మరో కుటుంబం వద్ద నెల రోజుల వయసున్న బాబు ఉన్నట్లు శిశు సంక్షేమ శాఖకు సమాచారం అందింది. దీంతో ఈ నెల 15వ తేదీన ఐసీడీఎస్ అధికారులు విచారణ చేయగా, తమ బంధువుల పిల్లలుగా వారు సమాధానమిచ్చారు. బుధవారం ఐసీడీఎస్ అధికారులు మాన్‌తండాలోని దంపతులను మరోసారి విచారించగా బంధువుల పిల్లలు అని, దత్తత తీసుకున్నామని పొంతన లేని సమాధానాలు చెప్పారు. ఈ క్రమంలో వాస్తవాలను తెలుసుకునేందుకు శిశు సంక్షేమశాఖ అధికారులు దామరచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణ ఆధారంగా శిశువులను బాలల సంక్షేమ సమితికి అప్పగించనున్నట్లు సీడీపీవో చంద్రకళ తెలిపారు. ఈ విషయమై దామరచర్ల ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డిని వివరణ కోరగా శిశుసంక్షేమ శాఖ అధికారుల ఫిర్యాదుతో విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

నార్కట్‌పల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం బుధవారం కావడంతో నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో సుప్రభాత సేవతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అద్భుతంగా అలంకరించిన అయ్యప్ప మూలవిరాట్‌ను స్వాములు, భక్తులు దర్శించుకున్నారు. భజన కీర్తనలతో ఆలయం మారుమ్రోగింది. అనంతరం మధ్యాహ్నం ప్రజ్ఞాపురం కోటయ్య కుటుంబ సభ్యులు అయ్యప్ప స్వాములకు భిక్షదానం చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లి వెంకన్న గురుస్వామి, పుల్లెంల అచ్చాలు, వేముల నర్సింహ, జెరిపోతుల భరత్ పాల్గొన్నారు.

2 నుంచి హాలియాలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

హాలియా, నవంబరు19(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా హాలియా పట్టణంలోని టైం పాఠశాల ఆవరణలో డిసెంబరు 2,3,4 తేదీల్లో 51వ జూనియర్ బాలికల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్గనైజింగ్ కన్వీనర్ జి.కర్తయ్య, కోకన్వీనర్ ఆర్.భూలోకరావు తెలిపారు. హాలియాలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ పోటీలను నల్లగొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పగలు, రాత్రి వేళల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల బాలికల బృందాలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హార్ట్ ఫెడరేషన్ అధ్యక్షుడు బి.వెంకటరత్నం, రాష్ట్ర టెక్నికల్ సభ్యుడు సీహెచ్.డొమినిక్, జిల్లా కోశాధికారి జై.చంద్రయ్య, టైం పాఠశాల కరస్పాండెంట్ మందా నరేందర్‌రెడ్డి, కోటిరెడ్డి, కార్యవర్గ సభ్యులు యడవల్లి రాంబాబు, అన్వర్‌ఖాన్, సత్యనారాయణ, పరమేష్, సైదులు పాల్గొన్నారు.

రేపు భువనగిరిలో అథ్లెటిక్ పోటీలు

భువనగిరి గంజ్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బాలికలకు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కోనేటి గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు 14 సంవత్సరాలలోపు బాలికలు అర్హులని పేర్కొన్నారు. ఖేలో ఇండియా ఆధ్వర్యంలో అస్మితలీగ్‌ను గ్రామీణ స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యంగా పోటీలకు ఎంపికవుతారని తెలిపారు.

అండర్-14: ట్రయాథ్లాన్-ఏ: (60 మీటర్ల పరుగు), లాంగ్ జంప్ (5మీటర్లు అ ప్రోచ్), హైజంప్ (సీజర్ గేమ్), ట్రయాథ్లాన్-బీ: (60మీటర్లపరుగు), లాంగ్‌జంప్ (5మీట ర్లు అప్రోచ్), షార్ట్‌పుట్ బ్యాక్‌త్రో, ట్ర యాథ్లాన్-సీ: (60మీటర్ల పరుగు), లాంగ్ జంప్ (5మీటర్లు అప్రోచ్),600మీటర్ల పరుగు.

అండర్-16: 600మీటర్ల పరుగు, హైజంప్ (సీజర్‌గేమ్), లాంగ్ జంప్ (5మీటర్ల అప్రోచ్), డిస్కస్ త్రో, షార్ట్ పుట్ (స్టాండింగ్ త్రో), జావెలిన్ త్రో (500 గ్రా-10మీటర్ల అప్రోచ్). తదితర పోటీల్లో ఆన్‌లైన్‌లో ఉచితంగా నమోదు చేసుకోవచ్చు. నమోదైన క్రీడాకారులు ఈ నెల 21వ తేదీన ఉదయం 8 గంటల వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఓరిజినల్ కుల, 10వ తరగతి, జన్మదిన ధ్రువీకరణ పత్రాలతో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

సైనిక్ స్కూల్‌గా సాగర్ బీసీ గురుకులం!

● పూర్తయిన దరఖాస్తు పరిశీలన

నాగార్జునసాగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రం, ప్రముఖ విద్యా కేం ద్రంగా విరాజిల్లుతున్న నాగార్జునసాగర్ శిగలో మరో మణిహారం రాబోతుంది. 2026-27 విద్యా సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 100 సైనిక్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ గురుకులాలు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దరఖాస్తులు చేసుకోవాలని నిర్ణయించాయి. రాష్ట్రంలో సొంత భవనాలు ఉన్న 21 మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాల్లో విశాలమైన భవన సముదాయం, క్రీడా మైదానం, ఖాళీ స్థలం ఉన్న నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్, మూసీ బీసీ గురుకుల పా ఠశాలలు సైనిక్ స్కూల్ ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్నాయి. దీంతో ఈ నెల 18వ తేదీన సైని క్ స్కూల్ ఏర్పాటు కమిటీ లీడర్, ఎయిర్ ఫోర్స్ అధికారి, కర్ణాటక రాష్ట్రంలోని



సాగర్ హిల్‌కాలనీలో ఉన్న బీసీ గురుకుల పాఠశాల

బీజాపూర్ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కెప్టెన్ రాజ్యలక్ష్మి పృథ్వీరాజ్ నేతృత్వంలో నల్లగొండ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీనివాస్‌తో కలిసి దరఖాస్తులను పరిశీలించారు. సాగర్ బీసీ గురుకుల పాఠశాల దరఖాస్తు పరిశీలించిన అనంతరం ఈ బృందం సభ్యులు సంతృప్తిని వ్య క్తం చేశారు. అనంతరం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌తో సమావేశమయ్యారు. ఈ మేరకు నివేదికలు తయారు చేసి కేంద్ర రక్షణ శాఖ మంత్రిత్వ శాఖకు అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. రాష్ట్రంలో 40 ఎకరాల సువిశాలమైన ప్రాంగణం కలిగి ఉన్న నాగార్జునసాగర్‌లో ఉన్న బీసీ గురుకుల పాఠశాలకు సైనిక్ స్కూల్ ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

స్థానికుల హర్షం

సాగర్ హిల్‌కాలనీలో బీసీ గు రుకుల పాఠశాలలో సైనికల్ స్కూల్ ఏర్పాటు కాబోతుందన్న విషయం తెలుసుకున్న స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగర్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేస్తే సాగర్‌కు దేశంలో మరింతగా పేరు వస్తుందని స్థానికులు చెపుతున్నారు.

సాగర్ గురుకుల పాఠశాల ప్రస్థానం ఇది

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 1985లో తెలంగాణ ప్రాంతంలో సాగర్ హిల్‌కాలనీలో బీసీ గురుకుల పాఠశాల, ఏపీ వైపున బీసీ గురుకుల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడానికి శంకుస్థాపన చేశారు. ఏడాది కాలంలో భవన నిర్మాణాలు పూర్తి చేసుకోని 1986-87 విద్యాసంవత్సరంలో 6వ తరగతి నుంచి బీసీ గురుకుల పాఠశాలను ప్రారంభించారు. ప్రతి ఏడాది ఒక్కో తరగతిని పెంచుతూ పదోతరగతి వరకు ఏర్పాటు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సర్వేల్ తర్వాత సాగర్ బీసీ గురుకుల పాఠశాలకు ప్రాముఖ్యత ఉంది. సాగర్ బీసీ గురుకులంలో విద్యనభ్యసించిన ప్రతి పదిమంది విద్యార్థుల్లో 8 మంది ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డవారే కావడం గమనార్హం. ఇంతటి గొప్ప పేరున్న బీసీ గురుకుల పాఠశాలలో చదివిన ఎందరో విద్యార్థులు విదేశాల్లో, స్వదేశంలో ఉన్నతాధికారులుగా స్థిర పడ్డారు. ప్రస్తుతం బీసీ గురుకులాల సెక్రటరీ సైదులు కూడా సాగర్ బీసీ గురుకుల పాఠశాలలో చదువుకున్న నాటి విద్యార్థి కావడం గమనార్హం.

దరఖాస్తు పరిశీలన పూర్తయింది



మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల వి ద్యాసంస్థల సెక్రటరీ సైదులు ఆదేశాల మేర కు సాగర్ బీసీ గురుకుల పాఠశాలలో సైనిక్ స్కూల్ ఏర్పాటు అనుమతుల కో సం జూలైలో దరఖాస్తు చేశాం. దరఖాస్తు పరిశీలన పూర్తయింది. దరఖాస్తును పరిశీలించిన అధికారులు సంతృప్తిని వ్యక్తం చేశారు. 40 ఎకరాల సువిశాలమైన క్రీడా మైదా నం, భవన సముదాయం ఉంది. సాగర్ బీసీ గురుకుల పాఠశాలకు సైనిక్ ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

- రవికుమార్, బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, సాగర్

జలాల్‌పురం చెరువుకట్టకు టెండర్ ఖరారు

● ఏడోసారికి ముందుకొచ్చిన కాంట్రాక్టర్లు ● త్వరలో మొదలుకానున్న పనులు



జలాల్‌పురం చెరువుకట్ట మూలమలుపు వద్ద తాత్కాలికంగా ఏర్పాటుచేసిన బారికేడ్లు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పురం చెరువుకట్ట రక్షణ చర్యలకు శ్రీకారం జరగనుంది. వారం రోజుల క్రితం ఏడోసారి టెండర్లు పిలవగా ఎట్టకేలకు ఓ కాంట్రాక్టర్ పనులు పనులు దక్కించుకుని అగ్రిమెంట్ చేసుకున్నాడు. గత ఏడాది డిసెంబరు 7న జలాల్‌పురంచెరువుకట్ట మూలమలుపువద్ద కారు అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లిన సంఘటనలో హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌కు చెందిన ఐదుగురు యువకులు జలసమాధి అయ్యారు. ఈ సంఘటన జరిగిన వారం రోజుల్లోనే మరో కారు చెరువులో పడిపోయింది. గతంలోనూ అనేక ప్రమాదాలు జరిగి ప్రాణ, ఆస్తినష్టం జరిగింది. అయితే ఈ సంఘటన నేపథ్యంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి వెంటనే స్పందించి ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి రూ. 20 లక్షలు మంజూరు చేయించారు.

జాప్యానికి కారణాలు ఇవీ..

జలాల్‌పురం చెరువు కట్ట పనులకు 11 నెలల క్రితమే రూ.20లక్షలు స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చొరవతో నిధులు మంజూరయ్యాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు ఆరు దఫాలుగా టెండర్లు పిలవగా కాంట్రాక్టర్లు ఎవ్వరూ ముందుకు రాలేదు. ఏడోసారి టెండర్లు పిలవగా ఓ కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నారు.

చేపట్టాల్సిన పనులు

ప్రమాదకరంగా ఉన్న జలాల్‌పురం చెరువు కట్ట వద్ద చెరువులోకి వాహనాలు పడిపోకుండా ఉండేందుకు చెరువుకట్టకు ఇరువైపులా మెటల్ బారికేడ్లు, మూలమలుపుల వద్ద మెయిన్‌రోడ్డుపై రంబుల్ స్ట్రిప్స్, రేడ్స్ స్టంట్, కాషన్ బోర్డుల, బ్లింకింగ్ లైట్లు తదితర పనులు చేపట్టాల్సి ఉంది. కాగా, ప్రమాదాల నివారణకు రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో తాత్కాలికంగా బారికేడ్లు ఏర్పాటు చేసి సరిపెట్టారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

జలాల్‌పురం చెరువు కట్ట వద్ద రక్షణ చర్యల్లో భాగంగా వివిధ పనులు చేపట్టేందుకు పలు మార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టరు ముందుకు రాలేదు. దీంతో నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. వారం క్రితమే టెండర్లు పూర్తయి అగ్రిమెంటు పూర్తయ్యింది. త్వరగా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు చెప్పాం. త్వరలో చెరువు కట్ట వద్ద రక్షణ చర్యలు ప్రారంభం అవుతాయి.

-సుగంధర్, ఆర్‌అండ్‌బీ డీఈఈ, భువనగిరి

రైతుల సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం

మోత్కూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరికోత యంత్రాల యజమానుల దోపిడీని అరికట్టాలని, పత్తి కొనుగోళ్లపై సీసీఐ విధించిన కఠిన నిబంధనలు ఎత్తివేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుల అవసరాలను ఆసరా చేసుకుని వరికోత యంత్రాలు యజమానులు, ఏజెంట్లు ధరలు బాగా పెంచి దోపిడీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇటీవల కురిసిన వర్షాలతో వరి చేలల్లో తడి ఆరకపోవడంతో చైన్‌మిషన్ల యజమానులు గంటకు రూ.3వేల నుంచి రూ.4 వేలు వసూలు చేస్తున్నారన్నారు. పత్తి కొనుగోలుకు సీసీఐ అధికారులు కఠిన నిబంధనలు పెట్టి పత్తి కొనకుండా రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారన్నారు. గతంలో ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు తీసుకునేవారని, ఇప్పుడు ఏడు క్వింటాళ్లే తీసుకుంటున్నారన్నారు. దీంతో మిగతా పత్తిని దళారులకు విక్రయించి, రైతులు నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడుతోందన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వరికోత యంత్రాల రేట్లు నియంత్రించాలని, సీసీఐ నిబంధనలు ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

మోత్కూరు, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మోత్కూరులో ఈ నెల 22న హైద్రాబాదు బషీర్ బాగ్‌లో నిర్వహించనున్న గీత పనివారల సంఘం రాష్ట్ర సదస్సు కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మోత్కూరు సొసైటీ అధ్యక్షుడు బీసు సత్తయ్య, నాయకులు అన్నెపు వెంకట్, పుల్కరం మల్లేష్, బత్తిని శ్రీనివాసులు, ఎడ్ల నరేష్, బోయిని వెంకన్న, బీసు సత్యనారాయణ, మడిపల్లి రంగయ్య, చాపల మల్లయ్య, బుచ్చయ్య, సోమయ్య, రాజయ్య, లింగయ్య పాల్గొన్నారు.

నేడు పాతగుట్ట చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ రాస్తారోకో

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 19, (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట పట్టణంలో పాతగుట్ట చౌరస్తా నుంచి పాతగుట్ట వరకు రోడ్డు విస్తరణ బాధితులకు పరిహారం ఇవ్వాలని కోరుతూ వారికి మద్దతుగా ఈ నెల 20న ఉదయం 9.30గంటలకు పాతగుట్ట చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టనున్నట్లు బీఆర్‌ఎస్ పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి తెలిపారు. బుధవారం గుట్టలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాస్తారోకోలో పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రోడ్డు బాధితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆయనతో పాటుగా నాయకులు పేరబోయిన సత్యనారాయణ, ఆరె శ్రీధర్‌గౌడ్, బుడిగె సత్తయ్య, బబ్బూరి వెంకటేశం ఉన్నారు.

సీనియర్ సిటిజన్‌కు సన్మానం

ఆత్మకూరు(ఎం) నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.పూర్ణచందర్‌రాజును కలెక్టర్ కార్యాలయంలో బుధవారం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సన్మానించారు. సీనియర్ సిటిజన్స్‌కు అందిస్తున్న సేవలకు గాను, ప్రభుత్వ వయోధికుల విభాగం నుంచి పూర్ణచందర్‌రాజుకు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్వో జయమ్మ, ఆత్మకూరు మండల టాస్కా అధ్యక్షుడు యాస పద్మారెడ్డి , జెట్ట యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మందులు అందుబాటులో ఉంచాలి

వలిగొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోగులకు సరిపడే మందులు అందుబాటులో ఉంచాలని ఎంపీడీవో జలేందర్‌రెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని అన్నారు. మూగజీవాలు కాటు వేస్తే వాటికి మందులు అందుబాటులో ఉండాలన్నారు. ఆస్పత్రి ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఆస్పత్రి సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రధాన రహదారులపై మద్యం షాపులను ఎత్తివేయాలి

భువనగిరి రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారులపై మద్యం షాపులను ఎత్తివేయాలని సామాజిక వేత్త చిదురప్ప సువర్ణరెడ్డి అన్నారు. బుధవారం రాయిగిరిలో ఆమె విలేఖరులతో మాట్లాడారు. తెలంగాణ తిరుపతిగా పేరు గాంచిన ప్రసిద్ధ పుణ్య క్షేత్రం యాదగిరిగుట్ట ప్రధాన రహదారి రాయిగిరి కమాన్ వద్ద సమీపంలోని వైన్స్‌ల వద్ద మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి కాలనీల వద్ద బహిరంగ ప్రదేశాల్లో మద్యాన్ని సేవించడంతో మహిళలు , భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయమై సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు దృష్టి సారించి బెల్టుషాపుల నివారణకు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు.

కంపెనీపై దుష్ప్రచారాన్ని మానుకోవాలి

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్న కంపెనీపై వ్యక్తిగత స్వార్థం కోసం చేస్తున్న దుష్ప్రచారాలనుమానుకోవాలని హెజిలో కెమికల్ కంపెనీ ఉద్యోగులు కోరారు. బుధవారం మండల పరిధిలోని దోతిగూడెం గ్రామ శివారులోని హెజిలో కెమికల్ కంపెనీలో భోజన విరామ సమయంలో ఉద్యోగులంతా సమావేశమైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతమ్మగూడెం గ్రామానికి చెందిన గుమ్మి దామోదర్‌రెడ్డి అనే వ్యక్తి తమ కంపెనీపై దుష్ప్రచారాన్ని చేస్తున్నారని అన్నారు. అతని స్వార్థ ప్రయోజనాల కోసం అదేపనిగా కెమికల్ కంపెనీపై అసత్య ఆరోపణలతో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు తప్పుడు సమాచారాన్ని అందిస్తూ కంపెనీ యాజమాన్యాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని అన్నారు. ఇటీవల కంపెనీ ఉద్యోగులు గ్రామానికి వెళ్లి నిజనిర్ధారణ చేయగా గ్రామస్థులు ఎవరూ తమకు ఎలాంటి ఇబ్బంది లేదని తెలియజేశారని అన్నారు. తమ కంపెనీపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని ఉద్యోగులు కోరారు. పర్యావరణానికి హాని కలిగించకుండా అనేక మందికి ఉపాధి కలిపిస్తున్న కంపెనీపై దుష్ప్రచారాన్ని మానుకోవాలని, ఉద్యోగులు కోరారు.

జూలూరు-పిలాయిపల్లి రోడ్డుకు మోక్షం

● రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే
● హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



జూలూరు-పిలాయిపల్లి రోడ్డు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భూదాన్‌పోచంపల్లి మండలంలోని జూలూరు గ్రామం నుంచి పిలాయిపల్లి గ్రామం వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులు ఎట్టకేలకు పూర్తి అయ్యాయి. జూలూరు నుంచి వయా అలీనగర్, పెద్దగూడెం గ్రామాల మీదుగా పిలాయిపల్లి వరకు గల 7 కిలోమీటర్ల మేరకు రోడ్డుపై గుంతలమయం కావడంతో వర్షాకాలంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గతంలో ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ఆర్టీసీ బస్సు కూడా బందు అయ్యింది. తిరిగి అధికారుల చొరవతో బస్సును పునరుద్ధరించారు. అధ్వానంగా మారిన ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు బీఆర్‌ఎస్ హయాంలో అనేక మార్లు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. ఈ మేరకు ప్రభుత్వం ఈ రోడ్డుకు రూ.1.80కోట్లు మంజూరు చేసింది. 2023లో రోడ్డు నిర్మాణ పనులకు అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు జూలూరు నుంచి అలీనగర్ వరకు రోడ్డు విస్తరించేందుకు రోడ్డంతా తవ్వారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులను అర్ధాంతరంగా వదిలేశారు. ఆ తర్వాత పలు కారణాలతో రోడ్డు పనులు ముందుకు సాగలేదు. అయితే ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడతి పనులు చేపట్టేలా ఒప్పించడంతో ఎట్టకేలకు పనులు ముందుకు సాగాయి. ఇటీవల ఈ రోడ్డు పనులు పూర్తి కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఈనెల 19న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఈ రోడ్డును ప్రారంభించారు.

రోడ్డు నిర్మాణంతో సంతోషంగా ఉంది



జూలూరు నుంచి పిలాయిపల్లి వరకు వయా పెద్దగూడెం రోడ్డు గతంలో అధ్వానంగా ఉండేది. వర్షాకాలంలో గుంతల రోడ్డుతో ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు పూర్తి చేయించారు. రోడ్డు పూర్తి కావడంతో చాలా సంతోషంగా ఉంది. ఈ రహదారి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

-పక్కీరు నర్సిరెడ్డి, పెద్దగూడెం గ్రామం

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

గ్రామాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా దేశ్‌ముఖి - పిలాయిపల్లి రోడ్డుకు, పెద్దగూడెం గ్రామంలో గౌడ సంఘం, పిలాయిపల్లి నుండి వయా పెద్దగూడెం జూలూరు వరకు రోడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ శాఖల అధికారులు కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకులు తడక వెంకటేష్, జిల్లా నాయకులు కళ్లెం రాఘవరెడ్డి, సామ మధుసూదన్‌రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాక మల్లేష్‌యాదవ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవకుమార్, మండల నాయకులు పక్కీరు మల్లారెడ్డి, పక్కీరు నర్సిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లాలయ్య, అంజిరెడ్డి, వెంకటేష్ గౌడ్, రాజిరెడ్డి, దానయ్య, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



జూలూరు-పిలాయిపల్లి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

సీపీఐ బస్సుజాతాకు స్వాగతం పలకాలి

ఆలేరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ బస్సుయాత్ర ఈనెల 20వ తేదీన జిల్లాలోకి ప్రవేశిస్తుందని, పార్టీ శ్రేణులు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఘన స్వాగతం పలకాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ కోరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బస్సు జాత 22వ తేది వరకు జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించి విస్తృత ప్రచారం నిర్వహిస్తుందని తెలిపారు. 22వ తేదీన రాజాపేట, ఆలేరు మండలాలో పర్యటిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఐలి సత్తయ్య, కనకయ్య, పల్లె శ్రీను, మాటూరు జానమ్మ, పోతు ప్రవీణ్, గొట్టిపాములు శ్రీనివాస్‌రాజు పాల్గొన్నారు.

బాధిత కుంటుంబానికి ఆర్థిక సాయం

సంస్థాన్ నారాయణపురం నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : సంస్థాన్ నారాయణపురం మండలంలోని చిమిర్యాల గ్రామానికి చెందిన బొడిగె రవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చల్లమల్ల కృష్ణారెడ్డి రూ.లక్ష అందజేశారు. కృష్ణారెడ్డి పంపిన రూ.లక్ష చెక్కును స్థానిక పార్టీ నాయకులు బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు చిలువేరు నర్సింహ, చెక్క నర్సింహ, నరేందర్, మైలారం రాములు, నరేష్, బోయిని నర్సింహ పాల్గొన్నారు.

రైతులకు పంట పరిహారం చెల్లించాలి

ఆలేరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పందులుచేసిన దాడిలో వరిపంట కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు ఎంఏ.ఎక్బాల్ మొరిగాడి రమేష్ డిమాండ్‌చేశారు. ఆలేరు పట్టణంలోని కాటమయ్య నగర్ సమీపంలో ఉన్న రైతులకు సంబంధించిన వరి పంటను పందులు ధ్వంసం చేసిన సంఘటనపై వారు స్పందించి బుధవారం పరిశీలించారు. అనంతరం మండల తహసీల్దార్ అంజనేయులును కలిసి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. పట్టణానికి చెందినరైతులు చిన్నంరాములు, సాయిలు, మొరిగాడి శ్రీను, జలేందర్, వల్లపురెడ్డి సాయిరెడ్డి, మొరిగాడిబాలయ్య, గనగాని మల్లేష్, రాజబోయిన జలేందర్ 10ఎకరాలలో వరి పంట సాగు చేయగా పందులు పంట పొలాల్లో స్వైర విహారం చేసి చేతికివచ్చిన పంటను పూర్తిగా ధ్వంసంచేశాయని ఆ వినతి పత్రంలో వివరించారు. దీంతో రైతులకు నష్టంజరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పడ్డేమాన్ బాల్‌రాజు, మొరిగాడి మహేష్, బాలయ్య, కావటి రామచంద్రయ్య, మొరిగాడి అంజయ్య, అశోక్ మధు, పలువురు పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: కోతుల బారి నుంచి ప్రజలు, పంట పొలాలను కాపాడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అనాజీపురంలో ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డాక్టర్ బొల్లేపల్లి కుమార్, నాయకులు ఎదునూరి మల్లేశ్, గునుగుంట్ల శ్రీనివాస్, వెంకటేశ్, జహంగీర్, స్వామి, కృష్ణ, దామోదర్ రెడ్డి, దశరథ ఉన్నారు.

వ్యాసరచన పోటీల విజేతలకు సర్టిఫికెట్ల అందజేత

మోత్కూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వయోవృద్ధుల సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల మోత్కూరులో విద్యార్థులకు 'వయోవృద్ధులపై వారసుల వేధింపులు' అనే అంశంపై వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లో విజేతలుగా నిలిచిన సెయింట్ ఆన్స్ హైస్కూలు విద్యార్థులకు బుధవారం కలెక్టరేట్లో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సర్టిఫికెట్లు అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ హైస్కూల్ కరస్పాడెంటు పసల మరియన్న, సీనియర్ సిటిజన్ మండల అధ్యక్షుడు ఎస్. భాస్కరాచారి, జె.సుబ్రమణ్యశర్మ, టి.మనోహరాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి: కేజీకేఎస్

భువనగిరి గంజ్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత కార్మికులకు ఎనినకల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలుచేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు డిమాండ్‌చేశారు. జిల్లా కేంద్రంలోని బుధవారం కేజీకేఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుల సమావేశం జిల్లా అధ్యక్షుడు రాగిరి కృష్ణయ్య అధ్యక్షతన జరిగింది. ఈనెల 28, 29, 30వ తేదీల్లో సూర్యాపేట జరిగే కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలు జరుగుతాయని, ఈ భారీ బహిరంగ సభకు గీత కార్మికులందరూ వేలాది మంది తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దూపటి వెంకటేష్, గాజుల అంజనేయులు, అంతటి అశోక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పీఆర్సీని ప్రకటించాలి: టీఎస్‌యూటీఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యాదయ్య

భువనగిరి గంజ్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు ముక్కెర్ల యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో భువనగిరి మండల శాఖ ఆధ్వర్యంలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే రెండు సంవత్సరాలు గడిచిన ఇంత వరకు పిఆర్సి అమలు చేయలేదని, 2010ముందు నియమాకమైన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. గురుకుల, మోడల్, గురుకల స్కూల్లో పనిచేస్తున్నటువంటి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, వారికి హెల్త్ కార్డులు జారీ చేసి, పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడు పి.సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జె.రవీందర్, ఉపాధ్యక్షులు డి.సునీత, రామదాసు, కోశాధికారి జె. మల్లేషం ఎన్నుకైయ్యారు. ఎన్నికల అధికారులు డి.స్వామి, వి.శ్రీదేవిలు, జీవి రమణరావు, ఇటికాల మల్లేషం తదితులున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దొడ్డి స్వామి తదితరులు పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య భూపాల్‌రెడ్డి అంత్యక్రియలు



భూపాల్‌రెడ్డి అంతిమయాత్రలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు వీరభద్రం, జూలకంటి రంగారెడ్డి, సీతారాములు, జహంగీర్(ఇన్‌సెట్లో) భూపాల్‌రెడ్డి(ఫైల్)

చౌటుప్పల్ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మాజీ సర్పంచ్, సీపీఎం ఉమ్మడి నల్లగొండ జిల్లా నాయకుడు చింతల భూపాల్‌రెడ్డి పార్థివ దేహానికి బుధవారం అశ్రునయనాల మధ్య బుధవారం అంత్యక్రియలను నిర్వహించారు. పట్టణంలోని విద్యానగర్ కాలనీలో గల తన ఇంటి నుంచి ప్రత్యేక వాహనంతో ప్రారంభమైన భూపాల్ రెడ్డి అంతిమ యాత్ర జాతీయ రహదారిపై తిరిగి సీపీఎం కార్యాలయం వద్దకు చేరుకుంది. అక్కడ భూపాల్ రెడ్డి పార్థివ దేహాన్ని కొద్ది సేపు ప్రజల సందర్శనార్థం ఉంచగా, ఆ ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి నివాళులర్పించారు. ప్రజా నాట్యమండలి కళాకారుల విప్లవ గీతాల నడుమ అంతిమయాత్ర సాగింది. కడసారి చూపు కోసం చుట్టపక్క మండలాలతో పాటు ఉమ్మడి నల్లగొండ, హైదరాబాద్ ప్రాంతాలనుంచి ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ ఎర్ర జెండా కోసం నిబద్ధతతో నిలబడిన యోధుడు చింతల భూపాల్‌రెడ్డి అని కొనియాడారు. పార్టీ విధానాల పట్ల నిబద్ధత, ఉద్యమాల నిర్వహణ లో పట్టుదల గల భూపాల్‌రెడ్డి భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయుడని ఆయన అన్నారు. అంతిమ యాత్రలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి, మండల, పట్టణ కార్యదర్శులు గంగదేవి సైదులు, గోశిక కరుణాకర్, దండ అరుణ్‌కుమార్, కాంగ్రెస్ మునుగోడు అసెంబ్లీ ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు సుర్వి నర్సింహ, బోయ దేవేందర్, బొడిగె బాలకృష్ణ, బత్తుల విప్లవ్ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం



భువనగిరి: ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భువనగిరి గంజ్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దేశ అభ్యున్నతికి ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తీ అన్నారు. జిల్లా కేంద్రంలో మాజీ ప్రధాని ఇందరాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోత్నాక్ ప్రమోద్ కుమార్, బర్రె జహంగీర్, పడిగల ప్రదీప్, నరసింహ, బాలరాజు పాల్గొన్నారు.

మోత్కూరు : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. నాయకులు వంగాల సత్యనారాయణ, గుండగోని రామచంద్రు, పేలపూడి వెంకటేశ్వర్లు, నూనెముంతల విమలవెంకటేశ్వర్లు, డాక్టర్ లక్ష్మీనర్సింహారెడి పాల్గొన్నారు.

ఆలేరు: నాయకులు వెంకటేశ్వర్‌రాజు, ఎజాజ్ నాయకులు నీలం వెంకటస్వామి, పద్మ, జూకంటి సంపత్, కల్వకుంట్ల లోకేష్, భాస్కర్, మహేష్, అనిల్, ముదిగొండ శ్రీకాంత్ పాల్గొన్నారు. మంతపురిలో గ్రామస్థులకు పండ్లు పంపిణీ చేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాస్ గౌడ్, నాయకులు కస్తూరి కిష్టయ్య, సంతోష్‌రెడ్డి, పల్లె రాజాలు, రాజయ్య గౌడ్, గుమ్మడి పాల్గొన్నారు. ఆలేరులోని ఏకశిల హైస్కూల్ విద్యార్థినులకు ప్రియదర్శిని హండాన్ శానిటరీ, నాప్‌కిన్స్ పంపిణీ చేశారు.

గుండాల: పార్టీ మండల అధ్యక్షుడు ఏలూరి రాంరెడ్డి, నాయకులు ఇమ్మడి దశరథ, షర్ఫొద్దిన్, యాదగిరి, భాస్కర్ పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కరంటోత్ శ్రీనివాస్‌నాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు మందుగుల బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి బిక్షపతి నాయక్, మాధవ రెడ్డి పాల్గొన్నారు.

రామన్నపేట : నాయకులు మహ్మద్ జమీరొద్దిన్, జింకల ప్రభాకర్ గోదాస్ పృథ్వీరాజ్, బొడ్డు సాలయ్య, సురేందర్‌రావు, వనం చంద్రశేఖర్, గుత్తా నర్సిరెడ్డి, నాసర్ జెల్లా వెంకటేశం పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మోత్కూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నూనెముంతల విమల, నాయకులు వై.లక్ష్మారెడ్డి, జి.శేఖర్‌రెడ్డి, డి.నవ్య, మార్కెట్ డైరక్టర్ పి. వినోద, కె.నరేందర్, జె.నగేష్ పాల్గొన్నారు.

వలిగొండ : మార్కెట్ కమిటీ చైర్మన్ బీమా నాయక్, నాయకులు పాషం సత్తిరెడ్డి, కంకల కిష్టయ్య, నూతి రమేష్‌రాజు, శ్రీను పాల్గొన్నారు.

గోవుల పట్టివేత

చౌటుప్పల్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కంటెయినర్‌లో అక్రమంగా గోవులను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ కృష్ణమల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైజాగ్ నుంచి హైదరాబాద్ బహదూర్‌పేటకు కంటెయినర్‌లో గోవులను తరలిస్తుండగా లింగోజిగూడెం శివారు జాతీయ రహదారిపై పోలీసులు పట్టుకున్నారు. కంటెయినర్‌లో 82 గోవులు ఉన్నాయి. యజమాని అక్బర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేశ్‌ముఖి గ్రామంలో గుడ్‌వర్క్ చారిటీ డాక్టర్ రాజ్ చిన్నం ఆద్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

భూమ్ మంతర్

(5వ పేజీ తరువాయి)

డాక్యుమెంట్లు సృష్టించారు. అయితే ఈ భూలావాదేవీకి సంబంధించి 2007, ఏప్రిల్ 28న బీ/4835/2006 నెంబర్ ద్వారా జారీచేయబడిన 13-బీ డాక్యుమెంట్, మరియు 2019, సెప్టెంబరు 23న నెం. 1810/2018 ప్రకారం జారీచేసిన 13బీ సర్టిఫికెట్ వివరాలేవీ సవరణల్లో రికార్డుల్లో నమోదు కాలేదంటే ఈ రెండు 13-బీలు నకిలీ డాక్యుమెంట్లుగా నిర్ధారించారు.

రిజిస్టర్‌లో నమోదుకాని అంశం

రెవెన్యూ కార్యాలయంలోని డిస్ట్రిబ్యూషన్ రిజిస్టర్‌లోనూ ఈ భూమికి సంబంధించి 13-బీ జారీ చేసిన అంశం నమోదుకాలేదు. వీరు సృష్టించిన తప్పుడు డాక్యుమెంట్ల ప్రకారం డిస్ట్రిబ్యూషన్ రిజిస్టర్‌లో సీరియల్ నెంబర్ 4835 ఈ 13-బీ జారీకి సంబంధించినదిగా పేర్కొన్నారు. దాన్ని పరిశీలించగా, ఆ పేజీ చిరిగిపోయి ఉన్నట్లు విచారణలో తహసీల్దార్ గుర్తించారు. చిరిగిపోయినది మినహాయించి మిగిలిన ఆ నెంబర్‌లో మిగిలిన వివరాలను పరిశీలించగా, 4835 నెంబర్‌లో వాస్తవానికి ఆర్డీవోకి నివేదించిన ఎస్సీ కుల ధ్రువీకరణపత్రం జారీకి సంబంధించిన ఎంట్రీగా నిర్ధారించారు. నకిలీ డాక్యుమెంట్‌లో పేర్కొన్న 13-బీ జిరాక్స్‌ని పరిశీలించగా, 2007, ఏప్రిల్ 28న బీ/4835/2006 నెంబర్‌తో 13-బీని అప్పటి తహసీల్దార్ యాదిరెడ్డి జారీ చేసినట్లు సృష్టించినట్లుగా గుర్తించారు. రవీంద్రసాగర్ తహసీల్దార్‌గా పనిచేసిన కాలంలో అయనే ప్రొసీడింగ్స్ ఇచ్చినట్లు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి మోహన్‌రావుకు ఈ-పీపీబీ ఇవ్వాలని, రెవెన్యూ రికార్డులలో సవరణలు చేయాలని సూచిస్తూ ఉత్తర్వుల కాపీని సృష్టించారు. తహసీల్దార్ పేరుతో 2109, సెప్టెంబరు 23న బీ/1810/2018 నెంబర్ ద్వారా ప్రొసీడింగ్స్ ఉత్తర్వుల కాపీని సృష్టించారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, మోహన్‌రావు దరఖాస్తును పరిశీలించిన అప్పటి గ్రామ వీఆర్‌వో, అదనపు ఆర్‌ఐ, పంచనామా, విచారణ జరిపి నివేదిక ఇచ్చారు. 2007, ఏప్రిల్ 28న జారీ చేసిన ప్రొసీడింగ్స్ నెంబర్ ప్రకారం బీ/4835/006తో 13-బీని అమలుచేయాలని ఆదేశించారు. అయితే ఈ తతంగానికి తనకు ఎలాంటి సంబంధం లేదని, తాను ఈప్రొసీడింగ్స్ ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. తాను అక్కడినుంచి బదిలీ అయిపోయాక నకిలీ ప్రొసీడింగ్స్‌ని సృష్టించి దుర్వినియోగం చేశారని ఆయన తాజా విచారణ సందర్భంగా స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలిసింది. ఆ ప్రొసీడింగ్స్ జారీ చేసినట్లు పేర్కొన్న సమయంలో వీఆర్‌వోగా తనీరు విజయ్‌కుమార్, ఏఆర్‌ఐగా సైదిరెడ్డి ఉన్నారని తెలిపారు. వారు పంచనామా చేసి, ప్రొసీడింగ్స్ జారీ చేసినట్లు పేర్కొంటున్న బీ/1810/2018.. 2009, సెప్టెంబరు 23న పేర్కొన్న ఏ నివేదికను తాను ఇవ్వలేదని, ఎలాంటి మెమోలు జారీ చేయలేదని ఆయన స్పష్టంగా లిఖితపూర్వకంగా నివేదించారని తెలిసింది. ఈ విచారణలో ఈ నకిలీ డాక్యుమెంట్ల ద్వారా భూబదలాయింపునకు మొత్తం తానే బాధ్యుడనని, నిరంజన్‌గౌడ్ రాజకీయ ఒత్తిళ్లతోనే తాను ఈ అవకతవకలకు పాల్పడ్డానని అప్పటి సీనియర్ అసిస్టెంట్ యూ. రాజేశ్ స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలిసింది. 2022లో గిర్కాటి నిరంజన్‌గౌడ్ తనను సంప్రదించి అతని వద్ద ఉన్న 2007, ఏప్రిల్ 28న జారీ అయిన బీ/4835/2006 13-బీ సర్టిఫికెట్, 2018, సెప్టెంబరు 23న చౌటుప్పల్ తహసీల్దార్ జారీ చేసిన ప్రొసీడింగ్స్ కాపీ నెంబర్ బీ/1810/2018 తనకు ఇచ్చారని, వాటిని రెవెన్యూ రికార్డులలో అమలు చేయాలని కోరారని రాజేశ్ తన స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారని విశ్వసనీయంగా తెలిసింది.

రాజకీయ ఒత్తిళ్లతోనే..

తాను చేయలేనని చెప్పినా, నిరంజన్‌గౌడ్ తనపై ఒత్తిడి తెచ్చారని, తాను చెప్పినట్లు ఆ రికార్డులను అమలు చేసి సర్వేనెంబర్ 42లో 3.05 ఎకరాల భూమిని తనపేరున మార్చకపోతే తనను బదిలీ చేయిస్తానని హెచ్చరించారని రాజేశ్ పేర్కొన్నారు. దీంతో ఒత్తిడికి లోనైన తాను రెగ్యులర్ తహసీల్దార్ సెలవులో ఉన్నప్పుడు ఇదే అదనుగా భావించి ఈఫైల్‌ని కదలించామని తెలిపారు. చౌటుప్పల్ డీఏవో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న సమయంలో అసలు విషయాన్ని అతనికి తెలియజేయకుండా ఆఫైల్‌ని సాధారణ ఫైళ్ల మాదిరిగా సమర్పించానని తెలిపారు. ఆ ఇన్‌చార్జి తహసీల్దార్ ఎలాంటి ప్రమేయం లేకుండానే సంతకాలు చేసి భూమిని రికార్డులలోకి మార్చాలని నివేదించారని, ఈ తతంగమంతటిని నిరంజన్‌గౌడ్ ఒత్తిడితో తాను ఒక్కడినే నిర్వహించానని, ఇందులో ఇతర అధికారులు, ఉద్యోగుల ప్రమేయం ఏమీ లేదని రాజేశ్ స్పష్టంగా అంగీకరించి లిఖిత పూర్వకంగా స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలిసింది. మొత్తం విచారణలో నిరంజన్‌గౌడ్ రూ.కోట్ల విలువైన భూమిని కాజేసేందుకు తప్పుడు పత్రాలు సృష్టించి రెవెన్యూ శాఖను, ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించారని, అదేవిధంగా విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశారని నిర్ధారించిన తహసీల్దార్ అతనిపై చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. నిరంజన్‌గౌడ్‌తోపాటు మరో ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో సహకరించిన రెవెన్యూ, ఇతర శాఖల ఉద్యోగులు, ఇతర రాజకీయ నాయకుల పాత్రను పోలీసులు తేల్చి వారందరిపైన చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడేందుకు సహకరించాలని తహసీల్దార్ ఫిర్యాదులో కోరారు.